

# నేటినిజం

తెలుగు దినపత్రిక


website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com






హైదరాబాద్ | గురువారం 7-1-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-2020 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక: 134 | పేజీలు: 8 | వెల: రూ.1/-


# బర్డ్‌ఫ్లూతో అప్రమత్తం అయిన కేంద్రం

## న్యూఢిల్లీలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు
## జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు హెచ్చరిక

న్యూఢిల్లీ,జనవరి 6(ఆర్ఎన్ఎ): బర్డ్ ఫ్లూ వ్యాధి వ్యాపిస్తున్నట్లు నిర్ధరణ కావడంతో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. కేంద్ర పశు సంవర్ధక, పాడి పరిశ్రమ శాఖ న్యూఢిల్లీలో ఓ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది. రాజస్థాన్, మధ్య ప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, కేరళ రాష్ట్రాల్లో బర్డ్ ఫ్లూ వ్యాప్తి నిర్ధరణ అయిన నేపథ్యంలో ప్రతి రోజూ పరిస్థితిని అంచనా వేసేందుకు చర్యలు తీసుకుంది. రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న నిరోధక, నియంత్రణ చర్యలను మదింపు చేయాలని నిర్ణయించింది. కేంద్ర పశు సంవర్ధక, పాడి పరిశ్రమ శాఖ విడుదల చేసిన ప్రకటనలో దేశంలో ఏవియన్ ఇన్‌ఫ్లుయెంజా నిరోధం, నియంత్రణ, కట్టడి కోసం రాష్ట్ర ప్రభుత్వాలకు మార్గదర్శకాల జారీ కోసం 2005లో చర్యల ప్రణాళికను సిద్ధం చేసినట్లు తెలిపింది. దీనిని 2006, 2012, 2015 సంవత్సరాల్లో సవరించినట్లు తెలిపింది. తాజాగా 2021లో కూడా దీనిని సవరించినట్లు పేర్కొంది. కలుషిత పౌల్ట్రీ ఉత్పత్తులను వినియోగించడం వల్ల మానవులకు బర్డ్ ఫ్లూ సోకుతుందనడానికి ప్రత్యక్ష సాక్ష్యాధారాలు లేవని స్పష్టం చేసింది. వైరస్‌లు, బ్యాక్టీరియా పశువులకు, పక్షులకు, మొక్కలకు సోకకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపింది. వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని పేర్కొంది. పారిశుద్ధ్యం, ఇన్ఫెక్షన్ సోకకుండా తగిన చర్యలు తీసుకోవాలని తెలిపింది. ఈ చర్యలు తీసుకుంటే ఏవియన్ ఇన్‌ఫ్లుయెంజా వైరస్‌ల వ్యాప్తిని నియంత్రించవచ్చునని పేర్కొంది. కేరళలోని కొట్టాయం, అలప్పుజ జిల్లాల్లో బర్డ్ ఫ్లూ వ్యాపిస్తున్నట్లు నిర్ధరణ అయింది. దీంతో రాష్ట్రంలో హై అలర్ట్ ప్రకటించారు. అదేవిధంగా హిమాచల్ ప్రదేశ్‌లో సుమారు 1,800 వలస పక్షులు ప్రాణాలు కోల్పోయాయి. రాజస్థాన్‌లో దాదాపు 425 పక్షులు చనిపోయాయి. మధ్య ప్రదేశ్‌లో సుమారు 152 కాకులు ప్రాణాలు కోల్పోయాయి.

# ఉద్యోగాల భర్తీకి పోలీస్ శాఖ కసరత్తు

## క్షేత్రస్తాయిలో శిక్షణ కోసం ఏర్పాట్లు

హైదరాబాద్,జనవరి 6(ఆర్ఎన్ఎ): త్వరలో భర్తీ చేయబోయే కొలువుల కోసం పోలీసుశాఖ క్షేత్రస్థాయి ఏర్పాట్లు మొదలుపెట్టింది. శిక్షణ సమయంలో గతేడాది ఉత్పన్నమైన మైదానాల కొరతతో పాటు ఇతర సమస్యలను ఈసారి పునరావృతం కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటోంది. తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు 2018లో 18,428 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చింది.

ఇందులో 16,925 కానిస్టేబుల్ పోస్టులు, 1,503 సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులున్నాయి. ఇందులో 9,213 మంది సివిల్, ఏఆర్ కానిస్టేబుళ్లు, 1,162 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లుకు జనవరి 17 నాటికి శిక్షణ ప్రారంభమైంది. కానీ, దాదాపు 4 వేల మంది తెలంగాణ స్టేట్ స్పెషల్ పోలీస్ (టీఎస్ఎస్‌పీ) కానిస్టేబుళ్ల శిక్షణలో తీవ్ర జాప్యం జరిగింది.

ఈసారి అలాంటివి లేకుండా రాష్ట్ర పోలీసు శాఖ ముందుగానే పొరుగు రాష్ట్రాలపైన ఏపీ, కర్ణాటకతో సంప్రదింపులు మొదలుపెట్టింది. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణలో పోలీసు శిక్షణ కోసం ఉన్న వనరులు కేవలం 6 వేల మందికి మాత్రమే సరిపోయేవి. కానీ, 2018 నోటిఫికేషన్ నాటికి వాటి సామర్థ్యాన్ని గణనీయంగా పెంచారు. ఏకంగా 12 వేలకుపైగా అభ్యర్థులకు ఒకేసారి శిక్షణ ఇచ్చేలా మౌలిక సదుపాయాలు కల్పించడంలో పోలీసుశాఖ సఫలీకృతమైంది. ఈసారి మైదానాలు, మౌలిక సదుపాయాల విషయంలో రాజీ పడకుండా ఇప్పటి నుంచే ప్రయత్నాలు మొదలుపెట్టారు. కర్ణాటక, ఏపీతో సంప్రదింపులు జరుపుతున్నా.. ఏపీ వైపే మొగ్గుచూపే అవకాశాలున్నాయి. ఈసారి 20 వేల పోస్టుల నేపథ్యంలో ఎలాగైనా ఏపీని ముందే సిద్ధం చేయాలన్న లక్ష్యంతో అధికారులు ముందుకెళ్తున్నారు.

# స్టేట్ బ్రాడ్ బ్యాండ్ కమిటీ సమావేశం

## సమాచార కవరేజీ విస్తరణకు అవసరమైన సహకారం: సిఎస్

హైదరాబాద్,జనవరి 6(ఆర్ఎన్ఎ): స్టేట్ బ్రాడ్ బ్యాండ్ కమిటీ రెండవ సమావేశం సీఎస్ సోమేశ్ కుమార్ అధ్యక్షతన బుధవారం బీఆర్‌కేఆర్ భవన్‌లో జరిగింది.

ఈ సమావేశంలో సీఎస్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ప్రతి 1000 మందికి 0.71 శాతం టవర్ డెన్సిటి ఉండగా దేశంలో 0.42 శాతం మాత్రమే ఉందన్నారు. నేషనల్ బ్రాడ్ బ్యాండ్ మిషన్ 2024 సంవత్సరం నాటికి 1.7 శాతానికి లక్ష్యంగా విధించిందని తెలిపారు. రాష్ట్రంలో బేస్ స్టేషన్ టవర్స్ ఫైబరేజేషన్‌కు, మంచి సమాచార కవరేజీ విస్తరణకు అవసరమైన సహకారం ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. రాష్ట్రంలో టవర్స్ ఫైబరేజేషన్ 35 శాతం ఉందని, నేషనల్ బ్రాడ్ బ్యాండ్ మిషన్ 70 శాతంగా విధించిన లక్ష్యాన్ని చేరుకుంటుందన్నారు. ఈ కమిటీలో పంచాయతీరాజ్, విద్యుత్‌శాఖల నుండి ప్రతినిధులను సభ్యులుగా చేర్చటానికి సీఎస్ హామి ఇచ్చారు.

109 ప్రాంతాల్లో టవర్ల ఏర్పాటుకు అవసరమైన అనుమతులు జారీ చేస్తామని సీఎస్ ఈ సందర్భంగా చెప్పారు. ఇప్పటికీ కవర్ కానీ 140 గ్రామపంచాయతీలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తామన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 24,961 టవర్లు ఉన్నాయని, ఇంకా 34,902 టవర్లు నిర్మించవలసి ఉందన్నారు.



బిఆర్కె భవన్‌లో సిఎస్ సోమేశ్ కుమార్ ఆధ్వర్యంలో స్టేట్ బ్రాడ్‌బ్యాండ్ కమిటీ రెండో సమావేశం జరిగిన దృశ్యం

ఈ సమావేశంలో రహదారులు, భవనాలశాఖ ముఖ్య కార్యదర్శి సునీల్ శర్మ, ఐటీశాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, అడ్వైజర్, డీవోటీ–ఎల్ఎస్ఏ యూనిట్, హైదరాబాద్, తెలంగాణ జె.వి. రాజా రెడ్డి, డైరెక్టర్(రూరల్), డీవోటీ–ఎల్ఎస్ఏ యూనిట్ జి.సురేష్ రెడ్డి, డైరెక్టర్(ఎలక్ట్రానిక్స్) ఐటీ అండ్ సీ డిపార్ట్‌మెంట్ సుజయ్ కారంపూరి, సీఎండీఆర్ డా. జెనా (సెల్యులార్ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా), టీఆర్ దువా (టవర్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రొవైడర్ అసోసియేషన్) తదితరులు పాల్గొన్నారు.

# ప్రవీణ్ రావు కిడ్నాప్ కేసులో పురోగతి

## మాజీమంత్రి భూమా అఖిలప్రియ దంపతుల అరెస్ట్
## కిడ్నాప్‌కు గురైన వారిని క్షేమంగా రక్షించిన పోలీసులు

హైదరాబాద్,జనవరి6(ఆర్ఎన్ఎ): హాకీ మాజీ క్రీడాకారుడు ప్రవీణ్ రావు కిడ్నాప్ కేసులో ఏపీకి చెందిన మాజీ మంత్రి భూమా అఖిలప్రియతోపాటు ఆమె భర్త భార్గవరామ్‌ను పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. ప్రవీణ్‌తో పాటు సునీల్, నవీన్‌ను కిడ్నాప్ చేశారని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అతని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు రంగంలోకి దిగి కిడ్నాపర్ల నుంచి ప్రవీణ్ రావుతో పాటు అతని సోదరులను కాపాడారు. అయితే ఈ కేసులో తనపై వస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని అఖిల ప్రియ తెలిపారు. తన భర్త కిడ్నాప్ చేయించే వ్యక్తి కాదని.. భార్గవ్‌కు కిడ్నాప్‌కు ఎలాంటి సంబంధం లేదన్నారు. తమ కుటుంబ సభ్యులను పోలీసులు అరెస్ట్ చేయలేదని.. తనకు కొంత సమయం ఇస్తే అన్ని విషయాలు మీడియాకు తెలుపుతానన్నారు. ఒక వైపు వాదనలు విని... తమపై తప్పుడు వార్తలు ప్రసారం చేయవద్దని మీడియాను కోరారు. మీడియా అంటే తమ కుటుంబానికి చాలా గౌరవం ఉందని.. త్వరలోనే అన్ని విషయాలు వెల్లడిస్తానన్నారు. ఇదిలా ఉంటే, బోయినపల్లిలో కిడ్నాప్‌కు గురైన ముగ్గురు వ్యక్తులు సురక్షితంగా బయటపడ్డారు. నార్సింగిలో ముగ్గురిని కిడ్నాపర్లు వదిలి పారిపోయారు. దీంతో ప్రవీణ్, నవీన్, సునీల్ సురక్షితంగా ఇంటికి చేరుకున్నారు. వీరు సీఎం కేసీఆర్ సోదరి తరఫు సమీప బంధువులు. వీరు ముగ్గురూ సీఎం కేసీఆర్ పీఏ వేణుగోపాలరావుకు బావమరుదులు. గత రాత్రి 11 గంటల సమయంలో సినీఫక్కీలో హకీ క్రీడాకారుడు ప్రవీణ్‌రావు కిడ్నాప్‌కు గురయ్యాడు. ఐటీ అధికారుల మంటూ ఇంట్లోకి చొరబడ్డ కిడ్నాపర్లు.. భూమా అఖిలప్రియ భర్త భార్గవ్‌రామ్ పేరుతో బెదిరింపులకు పాల్పడ్డారు. ప్రవీణ్‌రావు సహా ఇద్దరు సోదరులను దుండగులు కిడ్నాప్ చేశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు రంగంలోకి దిగారు. కిడ్నాప్‌కు గురైన ప్రవీణ్, నవీన్, సునీల్‌లను వికారాబాద్‌లో గుర్తించారు. ఈ కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేయగా.. మరో 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. అఖిల ప్రియ భర్త భార్గవ్‌రామ్ సోదరుడు చంద్రహాస్ పోలీసుల అదుపులో ఉన్నారు. హాఫీజ్‌పేటలోని వంద కోట్ల విలువైన భూమి కోసం కొంతకాలంగా గొడవ జరుగుతున్నట్లు తెలుస్తోంది. హాఫీజ్‌పేటలో ఉన్న భూమికి సంబంధించి ప్రవీణ్‌రావు కుటుంబానికి, అఖిలప్రియ కుటుంబానికి వివాదాలు నడుస్తున్నట్లుగా సమాచారం. ఈ క్రమంలోనే మంగళవారం రాత్రి కొంతమంది వ్యక్తులు ఐటీ అధికారులమంటూ ప్రవీణ్‌రావు ఇంట్లోకి ప్రవేశించారు. వారిని ప్రశ్నించాలంటూ ప్రవీణ్‌తో పాటు అతని సోదరులు సునీల్, నవీన్‌ను వాహనంలో తీసుకువెళ్లారు. వెంటనే అప్రమత్తమైన కుటుంబ సభ్యులు ప్రవీణ్‌ను అపహరించారంటూ పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని గాలింపులు చేపట్టారు. సీసీకెమెరాలను పరిశీలించి వారిని తీసుకెళ్లిన వాహనాన్ని గుర్తించారు. ఈ క్రమంలో సదరు వ్యక్తులు ప్రవీణ్‌తో పాటు అతని సోదరులను నార్సింగి వద్ద వదిలిపెట్టి పరారయ్యారు. మొయినాబాద్ వైపు కిడ్నాపర్లు పారిపోతుండగా వారిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా.. అఖిలప్రియ, భార్గవరామ్ పేర్లు వెలుగులోకి వచ్చాయి. దీంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు.

# రైతు వేదికలతో ఎంతో మేలు: ఎమ్మెల్యే గండ్ర

వరంగల్ రూరల్,జనవరి 6(ఆంఎన్ఎ): శాయంపేట మండలంలోని ప్రగతి సింగారం గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతు వేదికను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ప్రారంభించారు. అనంతరం ప్రగతి సింగారంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణానికి, శాయంపేట మండల కేంద్రంలో సూర్యోదయ మున్నూరు కాపు సంఘం భవనానికి ప్రహరీ గోడ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..రైతు వేదికల నిర్మాణంతో అన్నదాతలకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్ పర్సన్ గండ్ర జ్యోతి, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం

## ఎమ్మెల్యే కాలనీలో సీసీ కెమెరాల కంట్రోల్ రూం ప్రారంభించిన హైదరాబాద్ సీపీ అంజనీకుమార్

హైదరాబాద్,జనవరి 6(ఆర్ఎన్ఎ): నేరాలు తగ్గించడంలో సీసీ కెమెరాల పాత్ర ఎంతో కీలకమైందని హైదరాబాద్ సీపీ అంజనీ కుమార్ అన్నారు. సీసీ కెమెరాల ద్వారా 50 శాతానికి పైగా నేరాలను అదుపు చేస్తున్నట్లు తెలిపారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని అందుకే ప్రతి కాలనీలోనూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునేందుకు కాలనీ వాసులు కృషి చేయాలని తెలిపారు. బుధవారం బంజారాహిల్స్‌లోని ఎమ్మెల్యే కాలనీలో శ్రీ వెంకటేశ్వర బిల్డింగ్ సొసైటీ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల కంట్రోల్ రూంను సీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బృహస్పతి టెక్నాలజీ సంస్థ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ఎంతో అధునాతనమైనవని సీపీ ఈ సందర్భంగా పేర్కొన్నారు. అనంతరం కాలనీ సొసైటీ అధ్యక్షుడు సిద్దయ్య మాట్లాడుతూ రూ. 55 లక్షల వ్యయంతో ఎమ్మెల్యే కాలనీని సురక్షితంగా మార్చుకున్నామని తెలిపారు. రోడ్ నంబర్ 7,8 లలో మొత్తం 125 కెమెరాలను ఏర్పాటు చేయించామన్నారు. ఇక ఎటువంటి నేరాలు, ఉల్లంఘనలు జరిగినా వెంటనే సొసైటీ కార్యాలయంతో పాటు బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో వెంటనే తెలిసిపోతుందని తెలిపారు. బృహస్పతి టెక్నాలజీ వారు తక్కువ సమయంలో అప్పగించిన ప్రాజెక్టును విజయవంతంగా పూర్తి చేసి అప్పగించారని తెలిపారు. ఈ సందర్భంగా బృహస్పతి టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ రాజశేఖర్ పాపోలు మాట్లాడుతూ అనుకున్నదానికంటే ముందుగానే.. అంటే 2నెలల సమయంలోనే ప్రాజెక్టును పూర్తి చేసి కాలనీ సొసైటీ కమిటీకి అప్పగించినట్లు తెలిపారు.

కాలనీలో సాధారణ ఫిక్స్ డ్ కెమెరాలతో పాటు 6 అధునాతనమైన ఏఎన్‌పీఆర్ ..ఆటోమేటిగ్గా నంబరు ప్లేటును గుర్తించే కెమెరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. వాటిని కాలనీల ప్రవేశద్వారాల్లో మూడు చోట్ల ఏర్పాటు చేశామని, కాలనీలోకి వచ్చి పోయే కార్లు , బైకుల నంబర్లను అవి రెప్పపాటులో గుర్తించి భద్రం చేస్తాయని తెలిపారు. ఆ చిత్రాలన్నీ కంట్రోల్ సెంటర్ డాటాబేస్‌లో సేవ్ అవుతాయని వివరించారు. నెల రోజుల తర్వాత కూడా కావాలంటే వాటి బ్యాకప్ తీసుకోవచ్చుని చెప్పారు. సీసీ కెమెరాలను కాలనీ సొసైటీ ఆఫీస్‌లోని కంట్రోల్ రూంతో పాటు బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు కూడా అనుసంధానం చేశామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షుడు ఎన్.కె. బెంజిమిన్, కార్యదర్శి కె. వీరారెడ్డి, కోశాధికారి జి. రంగారెడ్డి, సభ్యులు జి. మోహన్‌రెడ్డి, ఎ. చంద్రశేఖర్, కె. ప్రతాప్‌రెడ్డి, ఎం. నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.సీసీ కెమెరాల ఏర్పాటులో బృహస్పతి టెక్నాలజీ సంస్థ దేశంలోనే ఎంతో ప్రాచుర్యం పొందుతోంది. ఎన్నోప్రతిష్ఠాత్మకమైన ప్రాజెక్టులను సరైన సమయంలో పూర్తి చేసన్తా పేరు సంపాదించుకుంటోంది. గత రెండేళ్లలో ఆంధ్రప్రదేశ్ ఎన్నికల కమిషన్ కార్యాలయంతో పాటు ఇటీవల డా.వైఎస్సార్ హెల్త్ కేర్ ట్రస్ట్ లో కూడా సీసీ కెమెరాల ప్రాజెక్టును విజయవంతంగా పూర్తి చేసింది. అదే విధంగా అసోం ప్రభుత్వంలోని కీలక కార్యాలయాలతో పాటు కజిరంగా జాతీయ పార్కులో జంతువుల కదలికలను పసిగట్టేందుకు అత్యాధునికమైన థర్మల్ కెమెరాలను కూడా తాము ఏర్పాటు చేసినట్లు బృహస్పతి సంస్థ ఎండీ రాజశేఖర్ తెలిపారు.



హైదరాబాద్ బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలో సిసి కెమెరాలను ప్రారంభించిన హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ అంజనీకుమార్

# ఉత్తరప్రదేశ్‌లో దారుణ ఘటన

## మహిళపై సామూహిక అత్యాచారం
## కిరాతకంగా హింసించి ఆపై హత్య

లక్నో,జనవరి 6(ఆర్ఎన్ఎ): ఉత్తరప్రదేశ్‌లో దారుణ ఘటన జరిగింది. బదౌన్ జిల్లాలో మానవ మృగాళ్ల అకృత్యానికి 50ఏళ్ల మహిళ అత్యంత దారుణంగా బలైపోయింది. దేవాలయానికి వెళ్లిన 50 ఏళ్ల మహిళపై కామాంధులు విరుచుకు పడ్డారు. ఆమె దేహంతో ఆటబొమ్మతో ఆడుకున్నట్లుగా అత్యంత కిరాతకంగా.. పాశవికంగా ఇష్టమొచ్చినట్లుగా ఆడుకున్నారు. తమ కామవాంఛ తీరాక వినటానికే వెన్నులో వణుకుపుట్టేవిధంగా ఛిద్రం చేశారు. దేవాలయానికని వెళ్లిన ఓ మహిళపై కొంతమంది కామాంధులు సామూహిక అత్యాచారం చేసి అనంతరం ఆమెను అతి కిరాతకానికి ఒడిగట్టారు. ఆమె పక్కటెముకలు విరిచేశారు. రెండు కాళ్లు విరగొట్టారు. అంతకంటే దారుణాతి దారుణంగా ఆమె ప్రైవేటు అవయవాలను దారుణంగా గాయపరిచారు. గత ఆదివారం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ దారుణ ఘటనపై పోలీసులు ఇలా చెప్పారు..బదౌన్ జిల్లాలోని ఉగైతీ ప్రాంతంలో అంగన్వాడీ కార్యకర్తగా పనిచేస్తున్న 50ఏళ్ల మహిళ ఆదివారం సాయంత్రం ఆ ప్రాంతంలో ఉండే ఓ దేవాలయానికి వెళ్లింది. ఆమె ఎంతకీ తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఆమె కోసం ఊరంతా వెతికారు. కానీ ఫలితం కనిపించలేదు. ఈక్రమంలో అర్ధరాత్రి సమయంలో ఆలయ పూజారి మరో ఇద్దరు కలిసి తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలో ఉన్న మహిళను ఇంటికి తీసుకొచ్చినట్లు ఆమె కొడుకు చెప్పాడు. మా అమ్మకు ఏమైందని ఆమె కొడుకు పూజారిని అడుగగా..ఈమె బావిలో పడిపోయిందని.. ఆమె అరుపులు విని తాము రక్షించి తీసుకొచ్చామని చెప్పి వెళ్లిపోయారని ఆమె కొడుకు చెప్పాడని పోలీసులు తెలిపారు. అయితే అప్పటికే తీవ్ర రక్తస్రావమైన ఆ మహిళ ఆసుపత్రికి తీసుకెళ్లేలోపు మృతిచెందింది. దీంతో మృతురాలి కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహానికి పోస్ట్‌మార్టం జరిపించారు. శవపరీక్షలో పోలీసులే షాక్ అయ్యే విషయాలు వెల్లడయ్యాయి. ఆమెపై సామూహిక అత్యాచారం జరిగిందనీ..ఈ దారుణ ఘటనలో ఆమెను సదరు నిందితులు తీవ్రంగా గాయపర్చినట్లు పోస్ట్‌మార్టం నివేదికలో తేలింది. ఆ మహిళ పక్కటెముకలు, కాళ్లను విరగ్గొట్టి, ఊపిరితిత్తులపై బలమైన వస్తువుతో పొడిచారని తేలింది. అంతేకాక ఆమె వ్యక్తిగత అవయవాలను కూడా దారుణంగా గాయపరిచారని నివేదికలో వెల్లడైంది. ఈ ఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఆలయ పూజారి, మరో ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని పోలీసులు తెలిపారు.

# పీఎం కేర్స్ కింద రాష్ట్రానికి సాయం

## ఐదు మెడికల్ ఆక్సిజన్ ప్లాంట్స్ మంజూరు

హైదరాబాద్,జనవరి 6(ఆర్ఎన్ఎ): పీఎం కేర్స్ ఫండ్ ట్రస్ట్ కింద రాష్ట్రానికి ఐదు మెడికల్ ఆక్సిజన్ జనరేషన్ ప్లాంట్స్ మంజూరు అయ్యాయి. పీఎం కేర్స్ కింద రూ.201.58 కోట్ల వ్యయంతో దేశవ్యాప్తంగా 162 ఆక్సిజన్ జనరేషన్ ఎ÷–లాంట్స్‌ను ఏర్పాటు చేస్తుండగా వీటిలో ఐదింటిని తెలంగాణలో నెలకొల్ప నున్నారు. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ పరిధిలోని స్వయంప్రతిపత్తి గల సెంట్రల్ మెడికల్ సైప్లై స్టోర్ వీటిని ఏర్పాటు చేయనుంది. మొత్తం 154.19 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో కూడిన ఈ 162 ప్లాంట్లను 32 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో నెలకొల్పనున్నారు. ఈ ప్లాంట్లు ప్రస్తుత మహమ్మారి సమయంలోని డిమాండ్‌ను తీర్చడంతో పాటు భవిష్యత్‌లో ప్రజారోగ్య వ్యవస్థను బలోపేతం చేయనున్నట్లు పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ జి. శ్రీనివాస రావు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే గాంధీ, నిమ్స్‌లో ఇటువంటి మెడికల్ గ్యాస్ ట్యాంకులను ఏర్పాటు చేయగా ఇటీవలే టిమ్స్, గచ్చిబౌలిలో ఈ లిక్విడ్ ఆక్సిజన్ ట్యాంక్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇటువంటి సౌకర్యాన్నే వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి, జిల్లా ఆస్పత్రి, కింగ్ కోఠి, సరోజిని దేవీ కంటి ఆస్పత్రి–మెహదీపట్నం, ఉస్మానియా జనరల్ ఆస్పత్రి–అఫ్జల్‌గంజ్, ఫీవర్ ఆస్పత్రి–నల్లకుంట, చెస్ట్ ఆస్పత్రి–ఎర్రగడ్డలో కల్పించనుంది.

## చరిత్రలో నేటినిజం



దీపమ్మకు - నటనకు ప్రతి
రూపమ్మకు - తెలుగు "బి.సరోజాదేవి"కి
ధూపమ్మకు - అమరేంద్రుని
చంపమ్మకు - నాంచి భక్తుడు - జయమునానసకన్!!



–రాధశ్రీ

సెల్: 9494481210

జనవరి 7 జాతీయ నటి బి. సరోజాదేవి పుట్టినరోజు..

# మల్లన్న స్వామి ఆలయంలో మంత్రి పూజలు

జగిత్యాల,జనవరి 6(ఆర్ఎన్ఎ): జిల్లాలోని గొల్లపల్లి మండలం మల్లన్నపేట గ్రామంలో బుధవారం దొంగమల్లన్న స్వామి వారిని సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ దర్శించుకున్నారు. మంత్రికి ఆలయ కమిటీ పూజారులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు చేసిన అనంతరం మంత్రి నిలువెత్తు బంగారం (బెల్లం) ఇచ్చి భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు. మంత్రి వెంట స్థానిక ప్రజాతినిధులు, అధికారులు ఉన్నారు.

# రైల్వే కోచ్ ఫ్యాక్టరీ కోసం కేంద్రం తలుపు తడతాం

## ఎంపిలు, ఎమ్మెల్యేలతో కలసి ఢిల్లీకి వెళతాం
## ఉన్నతస్థాయి సమీక్షలో మంత్రి ఎర్రబెల్లి వెల్లడి
## కొడకండ్లకు టెక్స్‌టైల్ పార్క్ ప్రకటనపై నేతన్నల హర్షం

వరంగల్,జనవరి6(ఆర్ఎన్ఎ): ఆరునూరైనా ఖాజీపేటకు రైల్వే కోచ్ ఫ్యాక్టరీని సాధిస్తామని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. ఎంతోకాలంగా ఈ డిమాండ్ పెండింగ్ ఉందని అన్నారు. విభజన సమయంలో కోచ్ ఫ్యాక్టరీకి హామీ లభించినా దక్కలేదన్నారు. కేంద్రం ఈ అంశంపై నాన్చివేత ధోరణి అవలంబిస్తోందని అన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో ఉమ్మడి జిల్లా ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేల మంతా కలిసి ఢిల్లీకి వెళ్తామని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు స్పష్టం చేశారు. వరంగల్ అర్బన్ కలెక్టరేట్‌లో రైల్వే కోచ్ ఫ్యాక్టరీపై మంత్రి సమీక్షించారు. కేంద్రానికి వెంటనే లేఖ రాయడమా లేక వెళ్లి నేరుగా మంత్రిని కలవడమా అన్నది చర్చించారు. ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, ఎంపీలు బండా ప్రకాశ్, పసునూరి దయాకర్, మేయర్ గుండా ప్రకాశ్ రావు, ఎమ్మెల్సీలు కడియం శ్రీహరి, బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యే అరూరి రమేశ్, వరంగల్ అర్బన్ కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు, కమిషనర్ పమేలా సత్పతి కాజీపేట రైల్వే ఉన్నతాధికారులు తదితరులతో కలిసి కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు అంశంపై సమీక్ష జరిపారు. ఇదిలావుంటే కొడకండ్లకు మినీ టెక్స్ టైల్ పార్క్ ని మంజూరు చేయించి, మంత్రి కెటిఆర్‌తో ప్రకటింప చేసినందుకు కృతజ్ఞతగా కొడకండ్ల మండలానికి చెందిన పలువురు చేనేత కార్మికులు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుకి కృతజ్ఞతలు, అభినందనలు తెలిపారు. హన్మకొండలోని మంత్రి క్యాంపు కార్యాలయం అర్ అండ్ బి అతిథి గృహంలో పలువురు చేనేత కార్మికులు మంత్రిని కలిశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పాలకుర్తి నియోజకవర్గంలో అత్యధికంగా చేనేత కార్మికులు, మర మగ్గాలున్నది కొడకండ్లలోనేనని వారు తెలిపారు. తమకు సిరిసిల్ల తరహా అభివృద్ధి జరగాలన్నది సంకల్పమని వారు అన్నారు. అయితే, అందులో భాగంగా మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తమ కొడకండ్లకు మినీ టెక్స్ టైల్ పార్క్ ని సాధించి పెట్టారని వారు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తమకు మరింత లబ్ది చేకూరేలా, సిరిసిల్ల తరహా సబ్సిడీలు లభించేలా చర్యలు తీసుకోవాలని వారు మంత్రి ఎర్రబెల్లిని కోరారు. కాగా, ఈ సందర్భంగా సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ల వల్లే ఇది సాధ్యమైందని, మనమంతా వారికి కృతజ్ఞతగా ఉండాలని చెప్పారు. త్వరలోనే మినీ టెక్స్ టైల్ పార్క్ కి భూమి పూజ, శంకుస్థాపన చేయిస్తామని మంత్రి వారికి తెలిపారు.

# కొత్తగా 417 కరోనా వైరస్ కేసులు

హైదరాబాద్,జనవరి6(ఆర్ఎన్ఎ): తెలంగాణ రాష్ట్రంలో గత 24 గంటల్లో కొత్తగా 417 కరోనా వైరస్ పాజిటివ్ కేసులు నమోదు అయ్యాయి. 472 మంది హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ అయ్యారు. గత 24 గంటల్లో రాష్ట్రవ్యాప్తంగా కరోనా వల్ల కేవలం ఇద్దరు మాత్రమే మరణించినట్లు రాష్ట్ర ఆరోగ్య శాఖ వెల్లడించింది. ఇప్పటి వరకు రాష్ట్రంలో నమోదు అయిన పాజిటివ్ కేసుల సంఖ్య 2,88,410గా ఉంది. మొత్తం రికవరీలు 2,81,872 మంది. ప్రస్తుతం యాక్టివ్ కేసుల సంఖ్య 4982గా ఉంది. ఇప్పటి వరకు రాష్ట్రంలో వైరస్ వల్ల మరణించిన వారి సంఖ్య 1556గా ఉన్నట్లు ఆరోగ్య శాఖ ఇవాళ హెల్త్ బులెటిన్‌లో పేర్కొన్నారు.

## బాల వికాసం

19

# బాలవర్ధన్

**ఈ తరం టీనేజ్ పిల్లల ఆధునిక కాల్పనిక నవల**

( ప్రసిద్ధ జానపద కథ బాలనాగమ్మ కథ స్ఫూర్తితో ఆధునిక సృజన)




ప్రసిద్ధ బాలల రచయిత డా॥ వి.ఆర్.శర్మ కలం నుండిజాలువారిన ఈతరం టీనేజ్ పిల్లల ఆధునిక కాల్పనిక నవల 'బాలవర్ధన్'. ప్రతివారం 'నేటినిజం' పాఠకుల కోసం ప్రత్యేకం...

"మిత్రుడా బాలవర్ధన్! కింద గమనిస్తున్నావు కదా! మనం మరి కొద్ది సేపట్లోనే గమ్యానికి చేరుకోబోతు న్నాం" బాలవర్ధన్‌ను అప్రమత్తం చేస్తూ చెప్పింది ఆ గండభేరుండం. ఆ పక్షి లోపల కూర్చొని తాము వెళుతున్న మార్గంలో కింద కనిపిస్తున్న మేఘాలూ, వాటి మధ్యలోంచి కింద చిన్నగా బొమ్మల్లా కనబడుతున్న పర్వతాలూ, అరణ్యాలూ, లోయలూ, ప్రవాహాలూ చూస్తూ 'ఆ ప్రదేశాలు ఎక్కడివై ఉండవచ్చా' అని ఆలోచిస్తున్న బాలవర్ధన్ ఆ పక్షి మాటలతో మరింత నిశితంగా చూడసాగాడు.

కింద వింత వింత రూపాల్లో కనిపిస్తున్న కొండలు. వరుసలుగా కాకుండా, కొన్ని కొన్ని, గుంపులు గుంపులుగా అసంఖ్యాకంగా కనబడుతున్నాయి. త్రిభుజాకారంలో కొన్ని, పొడవుగా కోట బురుజుల్లాగా కొన్ని, నిటారుగా నిలబడ్డ మినారుల్లాగా కొన్ని, బతుకమ్మల్లాగా కొన్ని కనబడుతున్నాయి. వాటి మీద కొన్ని చోట్ల గుబురుగా పెరిగిన చెట్లున్నాయి. సంధ్య వెలుగుల్లో జాజు రంగులో మెరుస్తున్న రాతి శరీరాలతో నిండిన కొండలు కనిపిస్తున్నాయి. వాటి చుట్టూ నేల కనబడకుండా కమ్ముకుని ఉన్న పొగ మబ్బులు సంధ్య కాంతుల్లో ప్రతి ఫలిస్తున్నాయి. వాటి కింద ఉన్న కొండల మొదళ్ళూ, అడవులూ, లోయలూ, జల ప్రవాహాలూ ఆ మేఘాల సందుల్లోంచి అప్పుడప్పుడూ మసక మసకగా కనిపిస్తున్నాయి. ఆ పక్షి క్రమంగా కిందికి దిగుతున్నది. కింద గుండ్రగా వలయాలుగా ఆ కొండల వరుసలు కనిపిస్తున్నాయి. ప్రతి పర్వతాల వలయం తరువాత పెద్ద పెద్ద అలలతో ఒడ్డులను హోరుమనే శబ్దంతో తాకుతున్న తరంగాలు భయపెడుతున్నాయి.

"మాయ ఇక్కడే ఉన్నాడేమో ఇంకా!" అన్నాడు బాలవర్ధన్.

"ఉహు. లేదు. అరగంట కిందట ఇక్కడ్నుంచి బయలు దేరి వెళ్ళాడు. నేను నా సమాచార వ్యవస్థతో ఆ విషయాన్ని తెలుసుకున్నాను. బాలవర్ధన్! నీ ముందున్న ఆ స్క్రీన్ మీద వేలితో టచ్ చేస్తే, నీ పక్కన ఉన్న డెస్క్ మీద ఓ రెండు రివాల్వర్ల వంటి ఆయుధాలు కనబడ్తాయి. అవి ప్రత్యేకంగా ఈ కార్యక్రమం కోసమే తయారు చేయబడ్డవి. వాటిని గురిచూసి ఉపయోగిస్తే అవి ఆ ల్యాబ్‌నూ, అక్కడి రోబోలనూ, వాళ్ల సమస్త సామాగ్రినీ బూడిదగా మార్చేస్తాయి" చెప్పిందా రోబోపక్షి.

"ఒకే...తీసుకున్నాను." అన్నాడు బాలవర్ధన్.

"మనం ఇప్పుడు నడుమ ఉన్న ఆకొండ లోపలికి వెళ్ళే సొరంగంలోనికి ప్రవేశిస్తున్నాం. సిద్ధంగా ఉండు.'' అంటూ గుండ్రగా తిరుగుతూ సొరంగంలోకి ప్రవేశించింది ఆ గండభేరుండం. ఆ సొరంగం చుట్టలు చుట్టినట్టు వలయాకారంలో గుండ్రగా తిరుగుతూ లోపలికి దిగుతున్నది. అలా ఎన్ని వేల అడుగులు కిందికి దిగారో వర్ధన్ ఊహించుకుంటూ ఉండగానే "నేను ఇంత కన్నా ముందుకు రాలేను" అని ఆ గండభేరుండం ఒక చోట ఆగిపోతూ చెప్పింది.

"దాదాపు వాళ్ళ ల్యాబ్ ముందుకు వచ్చేశాం. ఇక ఇక్కడ్నుంచి ఎదురుగా ఉన్న వైపు నడిచి వెళ్ళాలి. ఓ వంద అడుగులు. కానీ ఇరవై అడుగుల దూరంలో ఓ రాతి తలుపు మూసి ఉంటుంది. ప్రస్తుతం నా లోపల జరిగిన డ్యామేజ్ వల్ల నేను దాన్ని తెరవలేను. అంతే కాదు, ఆ రాతి తలుపులు దాటగానే అతినీల లోహిత కిరణాల ద్వారాన్ని కూడా దాటాలి. ఇప్పటి పరిస్థితులలో నేను దాన్ని దాటే ప్రయత్నంలో బూడిదై పోతాను. కనుక ఇక ముందుకు రాలేను. ఏంచేస్తావో నీ చేతుల్లోనే ఉంది" అంది ఆ గండభేరుండం బాలవర్ధన్ వైపు ప్రశ్నార్థకంగా చూస్తూ.

"ఫరవాలేదు. నేను లోపలికి వెళ్ళి పని పూర్తి చేసుకుని వస్తాను. ప్రాచీ నాకు ఇచ్చిన వస్తువుల్లో కొన్ని అద్భుతమైన వస్తువులు ఉన్నాయి. ఆ డ్రెస్‌వేసుకుని, నేను దేని లోనుంచైనా క్షేమంగా దూరి వెళ్ళగలను. అది ఎలాంటిదైనా సరే. నువ్వు ఇక్కడే నా కోసం వెయిట్ చేస్తే చాలు." అని తనకు కావలసినవస్తువులను తీసుకొని, చకచకా దుస్తులు మార్చుకొని ముందుకు నడిచాడు బాలవర్ధన్. ఆ రాతిలోంచి అతి మామూలుగా నడిచి ఏ విధమైన ఆటంకం లేకుండా అవతలి వైపుకు చేరుకున్నాడు. బాలవర్ధన్ ధరించిన కళ్ళద్దాల్లోంచి ఎదురుగా ఉన్న అతి నీలలోహిత ద్వారం స్పష్టంగా కనిపిస్తున్నది. పైనుంచి కిందికి నీలిరంగుకాంతి ఓ జలపాతంలా ప్రవహిస్తున్నది.

ఏ సంకోచం, భయం లేకుండా నిదానంగా దాని కిందినించి అవుతలి వైపు నడుస్తూ వెళ్ళాడు. అక్కడి నుంచి కొంచం ముందుకు నడిచి కుడి వైపుకు తిరుగుతూ, తన బ్యాగు లోంచి ఓ క్యాప్‌ను తీసి తలమీద పెట్టుకున్నాడు. దాన్ని తలమీద పెట్టుకున్న మరుక్షణం తాను అదృశ్య రూపంలోకి మారిపోతాడని బాలవర్ధన్‌కు తెలుసు. అదికూడా ప్రాచీ ఇచ్చింది.

ఓ వెయ్యి గజాల పొడవూ, ఓ ఆరేడు వందల గజాల వెడల్పు ఉన్న గుహ అది. దాని పై కప్పు ఓ వంద అడుగుల ఎత్తులో ఉంది. దాని గోడలూ, పైకప్పూ రకరకాల రూపాలతో, లక్షల సంవత్సరాల కిందట ఏర్పడ్డ స్టాలగ్‌మైట్, స్టాలగ్‌టైట్ శిలలతో భయంగొల్పేలా ఉన్నాయి. వాటిలో కొన్ని శిలలనుంచి నీలి, ఎరుపు, పసుపు, రంగులు ప్రసరిస్తూ ఆ ప్రాంతాన్ని వింత వెలుగులతో వెలిగిస్తున్నాయి. నేలనుంచి పైవరకు గాజుతో నిర్మించిన ఏవో నిర్మాణాలు, సన్నగా ఏదో పొగను వదులుతున్న పెద్ద పెద్ద నల్లటి పొగగొట్టాలు కనిపిస్తున్నాయి. సొరంగం రెండోవైపు, కుడిదిక్కు ఓ గాజుగది, దానిలోపల రకరకాల పరికరాలు, పరీక్ష నాళికలు, వాటిలో ఏవో ద్రావకాల వంటివి, ఇంకా ఏవేవో పరికరాలు కనిపిస్తున్నాయి. ఇద్దరు మనుషులు అక్కడ నిలబడి ఏదో చేస్తున్నారు. మరో ఇద్దరు లోనికివెళ్ళే తోవలో రాళ్ళపక్కన చేతుల్లో విచిత్రమైన ఆయుధాలు పట్టుకుని నిలబడి ఉన్నారు.



నిజానికి వాళ్ళు మనుషులు కారని, గ్రహాంతర వాసులు పంపించిన కృత్రిమ మేధ కలిగిన రోబోలని గ్రహించాడు బాలవర్ధన్. గదిలోపల ఉన్నవాళ్లు పరిశోధనలు చేసేవాళ్ళనీ, గదిబయట నిలబడి కాపలా కాస్తున్నవాళ్ళు సైనికులని అర్థం చేసుకున్నాడు. వాళ్లకు తను కనబడడు. కనుక భయపడ వలసిందేమీ లేదు. కాకపోతే జాగ్రత్తగా ఉండాలి. మొదట మాయను నడిపించే ఆ ప్రోగ్రాం చిప్ ఉన్న ఆ చిలుక వంటిది ఎక్కడుందో వెతకాలి. ఆ గ్రహం వాళ్లకు 'ఈ చిలుక సెంటిమెంట్ ఏమిటో' అనిపించింది. తన కంటి అద్దాల ఫ్రేమ్ ముందు భాగంలో ఓచోట చూపుడు వేలితో చిన్నగా ప్రెస్ చేశాడు బాలవర్ధన్. వెంటనే తన కళ్ళముందు ఓ చిన్న ఎర్రటి డాట్ లాంటిది కనిపించింది. నిశ్శబ్దంగా అది కదులుతున్న వైపు నడవడం మొదలు పెట్టాడు.

సొరంగం చివరి వైపు తీసుకొని పోయిందది. సొరంగం దాటించింది. ఆ సొరంగం దాటగానే పెద్ద పెద్ద చెట్లు కనిపించాయక్కడ. అవి చాలా పెద్దబోదెలతో ఎత్తుగా, దట్టమైన కొమ్మలు గుబురుగా ఉన్న ఆకులతో కనిపిస్తున్నాయి. వాటి కింద రాళ్ళూ, రప్పలూ, రాలిపడిన ఆకులూ ఉన్నాయి.

బాలవర్ధన్ అక్కడ నిలబడి వాటి వైపు నిశితంగా చూశాడు. తనకు కనబడుతున్న ఆ డాట్ వాటి మధ్యలో ఉన్న ఓ వృక్షాన్ని చూపిస్తున్నది. మెల్లగా అటు నడిచాడు. ఓ నలుగురు కలిసి చేతులు కలిపి నిలబడితే తప్ప ఆ బోదెను చుట్టూ కౌగిలించు కోవడం సాధ్యం కానంత పెద్దగా ఉంది. ఆ బోదెనే చూపిస్తోంది తన కంటి అద్దాల్లో కనిపిస్తున్న ఆ చుక్క.

ఓసారి ఆ బోదె చుట్టూ జాగ్రత్తగా చూస్తూ ప్రదక్షిణం చేశాడు. ఒకచోట చేతి కందనంత ఎత్తులో పెద్ద తొర్ర ఒకటి కనిపించింది. ఆ చుక్క ఆ తొర్రను చూపిస్తున్నది. నున్నగా ఎక్కడా పట్టు చిక్కకుండా ఉన్న ఆ బోదెను మామూలుగా ఎక్కడం సాధ్యమయ్యేలా లేదు. తన బూట్ల అడుగున మడిమలు ఉన్న చోటున బలంగా అదిమి పట్టి పైకి ఎగిరాడు బాలవర్ధన్. నిదానంగా అలా గాలిలోకి లేస్తూ వెళ్ళి, ఆ చెట్టు తొర్ర ఉన్న చోట అలా గాలిలో తేలుతూ నిలబడ్డాడు. ఇక్కడ ఏం జరుతుందో అన్న ప్రతి విషయాన్నీ ఆలోచించి, ఊహించి అందుకు తనకు అవసరమైయ్యే వస్తువులను సమకూర్చి ఇచ్చిన ప్రాచీ పట్ల, ఆమె తల్లి పట్ల ఎంతో గౌరవం కలిగిందా క్షణం బాలవర్ధన్‌కు. 'థాంక్స్ టూ దెమ్' అనుకున్నాడు.

ఆ చెట్టు తొర్ర చాలా పెద్దగా ఉంది. ముందుకు వంగి లోపలికి తల దూర్చి చూశాడు. లోపల ఓ పక్షి మాత్రం కనబడింది. మరేమీ లేదు. మామూలుగా చూసేవాళ్లకు అదో సహజమైన చెట్టులా, అది మామూలు చిలుకలా కనిపిస్తాయి. కానీ వాటి గురించి బాలవర్ధన్‌కు తెలుసు. కనుక సందేహించకుండా చేయి లోపలికి జాపి ఆ చిలుకను అందుకున్నాడు. కీచున పెద్దగా అరిచి, రెపరెపా రెక్కలు కొట్టుకుందా చిలుక. ముక్కుతో పొడిచే ప్రయత్నం చేసింది. కానీ బాలవర్ధన్ చేతికి ఉన్న ప్రత్యేకమైన గ్లౌజులు దానికి ఆ అవకాశం ఇవ్వలేదు. వెంటనే దాన్ని తీసుకొని కిందికి దిగి వచ్చాడు బాలవర్ధన్.

దాని అరుపులు లోపల ఉన్న వాళ్ళకు వినిపించినట్టు ఉన్నాయి. ఓ రోబో చేతిలో ఆయుధం ఎక్కుపెట్టుకుని అక్కడికి వచ్చేసింది. కానీ దానికి అక్కడ ఏమీ కనిపించడం లేదు. చిలుక అరవకుండా దాని తలనూ, ముక్కునూ ఎడమ చేతితో నొక్కి, దాన్ని సైడ్ జేబులోకి తోసేశాడు బాలవర్ధన్. నిశ్శబ్దంగా గుహ లోపలికి వచ్చేశాడు. ఒక్కొక్క రోబోని తుదముట్టించడం తన లక్ష్యం కాదు. ఆ ల్యాబ్‌ను పూర్తిగా నాశనం చేయాలి. అందుకు వీళ్ళ ఎనర్జీ కేంద్రాన్ని ధ్వంసం చేయాలి. తను గుహ లోపలికి వచ్చేటప్పుడు దాన్ని చూశాడు. అది ఆ గుహలో పచ్చటి వెలుగు ప్రసరిస్తున్న ఓ చోట, రాళ్ల చాటున కనిపించింది. అక్కడే దాన్ని కాపలా కాస్తున్న రోబోలూ కనిపించారు.

అక్కడ లోపల ఉన్నవాళ్ళు కూడా ఏంజరిగిందో తెలుసుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారు. అంతటా చెక్ చేస్తున్నారు. బాలవర్ధన్ జేబు లోపల చిలుక కదలడం లేదు. బహుశా తలను నొక్కి పట్టుకోవడం వల్ల ఏమైనా సర్క్యూట్లు దెబ్బతిని ఉండొచ్చు. వీళ్ళు ఇంకా ఆ తొర్రలో చిలుక కనిపించక పోవడాన్ని గమనించ నట్టున్నారు.

బాలవర్ధన్ ఆ విచిత్ర జంతువులాంటి యంత్రం దగ్గరగా వెళ్ళి నిలబడ్డాడు. దాని చుట్టూ గాజు పలకలతో ఏర్పాటు చేసిన చిన్న గది ఉంది. కంటికి కనిపించని ఎర్రటి కాంతి వలయం ఆ గాజు గది చుట్టూ రక్షణ వలయంలా ఉంది. జాగ్రత్తగా రెండు చేతుల్లోకి గండభేరుండం ఇచ్చిన ఆయుధాలు తీసుకున్నాడు. ఈ పని కోసమే గ్రహాంతర వాసులు తయారు చేసిన ఆయుధాలు ఇవి. వీటిని ప్రయోగిస్తే ఇక తిరుగులేదు. ఏంజరిగిందో కనుక్కోవడానికి అంతటా వెతుకుతున్న ఆ కృత్రిమ మేధతో పనిచేస్తున్న ఆ రోబో సైనికులు తనున్న వైపే వస్తుండడాన్ని గమనించాడు బాలవర్ధన్.

క్షణంలో తనను తను సిద్ధం చేసుకున్నాడు. అతని చేతుల్లోని ఆయుధాల్లోంచి చక్ చక్ మని మెరుస్తూ కొన్ని కిరణాలు ఆ యంత్రం ఉన్న వైపు ప్రసరించాయి. క్షణంలో నూరవవంతు సమయం...ఆ జనరేటర్ వంటిది గాజు గదితో సహా భళ్ళున శబ్దంచేస్తూ, భగ్గున మండి బూడిదై పోయింది. ఆ నుసి పొగతోబాటు గాలిలో ఎగిరి అదృశ్యమైపోయింది. దానితో బాటే ఆ ప్రయోగశాల, ఆ ఆర్టిఫిషియల్ ఇంటలి జెంట్ రోబోలూ అన్నీ చెత్త తగలబడిపోతే వచ్చే నుసిలా మారి, క్షణాల్లో గాలిలో కలిసి పోయాయి.

ఆ గుహకూడా కూలడం మొదలైంది.

బాలవర్ధన్ వేగంగా బయటకు నడుస్తూ, తన జేబులో చేయి పెట్టుకుని చిలుకను తడిమి చూసుకున్నాడు. అది జేబులోనే ఉంది కదలకుండా.

"మిత్రమా! నేను కూడా మరి కొద్ది సేపట్లోనే భస్మమై విశ్వధూళిలో కలిసి పోతాను. నిన్ను మాయ స్థావరానికి చేర్చగానే అది జరుగుతుంది." అని బాలవర్ధన్‌తో మాయ స్థావరానికి బయలుదేరిన ఆ గండభేరుండ రోబో పక్షి చెప్పింది.

"అయితే ఆ వివరాలు ఇక ఎవరికీ తెలియవా?" అడిగాడు బాలవర్ధన్.

"మాయకు తెలుసు. కానీ ఈ చిలుక కదలిక లేకుండా నిశ్చలమైపోయింది. గనుక, ఆ మాయ పరిస్థితి కూడా అలాగే ఉంటుంది. తన గ్రహంలో ఉన్న తన అధికారులతో మాట్లాడలేడు. ఏ సమాచారమూ పంపలేడు. అక్కడ ఆ ల్యాబ్ ధ్వంసం అయినప్పుడే వాళ్ల నడుమ కాంటాక్ట్ తెగిపోయింది. నాలోపల నా సమాచార వ్యవస్థ కూడా నాశనమైపోంది. కనుక నా పరిస్థితి కూడా దాదాపు అదే." చెప్పింది గండభేరుండ రోబోపక్షి.

"ఈ చిలుకను పూర్తిగా పనిచేయకుండా చేయడం ఎలా?"

"అది మీ గ్రహంలో ఉండే చిలుక లాగా ఉన్నా అది చిలుక కాదని నీకు అర్థమైందని అనుకుంటున్నాను. ఈ గ్రహంలో వాళ్లకు మొదట కనిపించిన ప్రాణి చిలుక. అందుకే ఈ ప్రయోగంలో ముఖ్యమైన మాయను కంట్రోల్ చేసే చిప్‌ను, చిలుకలాంటి రిమోట్‌లో అమర్చారు. నేను నీకు ఇచ్చిన ఆయుధాలు రెంటినీ కలిపి, ఒకే సారి దాని మీద ప్రయోగించు. అది బూడిదై శూన్యంలో కలిసిపోతుంది. నీ తల్లిదండ్రులను, ఇంకా అక్కడ బందీలుగా ఉన్న వాళ్ళను విడిపించుకునే వరకు దాని అవసరం నీకు ఉంది."

"ఔను! అప్పటి వరకు మాయ ఉండవలసిన అవసరం ఉంది" చెప్పాడు బాలవర్ధన్. కానీ మాయ వాళ్ళను ప్రాణాలతో విడిచిపెడ్తాడా? అందుకు సహకరిస్తాడా? తన కార్యక్రమాన్ని నాశనం చేసిన నామీద, ఇందుకు తోడ్పడ్డ మా అమ్మ మీదా, ప్రాచీ వాళ్ల అమ్మమీదా, ప్రాచీమీదా అతడికి కచ్చగా, కోపంగా ఉండదా? అందరినీ చంపేయాలనేంత ద్వేషం ఉంటుందేమో! " సందేహంగా అన్నాడు బాలవర్ధన్.

"అలా ఉండదు. ఎందుకంటే మాయ మనిషి కాదు. ఓ యంత్రం. తనకు చేయవలసిన పని చేయడం తప్ప కక్షలూ, మోసాలూ, ద్వేషాలూ వంటివి యంత్రాలకు ఉండవు. వాటిని అలా తయారు చేస్తే తప్ప! మాయ ఓ వైరస్‌కు సంబంధించిన మందునూ, వ్యాక్సిన్‌ను మనుషుల మీద ప్రయోగించి చూడడం కోసం సృష్టించబడ్డ ఓ యంత్రం. ఓ మంచి జీవ రసాయన శాస్త్రవేత్త మెదడును కలిపి సృష్టించిన మంచి యంత్రం మాత్రమే! తనను నడిపించే రియోట్ ఇప్పుడు నీ చేతుల్లో ఉంది. కనుక నీకు తప్పక సహకరిస్తాడు. మనం మాయ స్థావరానికి వచ్చేశాం!" చెప్పింది గండభేరుండం.

ఆ గుహ సొరంగంలోకి కొంత దూరంవెళ్లి ఆగుతూ, "ఇక వీడ్కోలు మిత్రమా! నా సమయం అయిపోయింది. నువ్వు తొందరగా కిందికి దిగాలి. బై..!" అంది.

"నీకు మా భూలోక వాసులందరి తరఫున అనేక కృతజ్ఞతలు!" అంటూ బాలవర్ధన్ కిందికి దిగాడు. గండభేరుండ అని బాలవర్ధన్ పేరు పెట్టిన ఆ ఆర్టిఫిషల్ ఇంటలిజెంట్ ఓ మెరుపు మెరిసినట్టుగా మెరిసి గాలిలో కలిసిపోయింది.

(సశేషం..)



-డా॥వి.ఆర్.శర్మ
సెల్:9177887749



### బాల గేయం

## కాయగూరలు!

బీరకాయ-పొట్లకాయ
సొరకాయ-గుమ్మడికాయ
అన్నివేళలా అందరికీ
ఆరోగ్యం కలిగించేను!
చిక్కుడు-బీన్స్-బెండకాయ
ఎక్కువ శక్తిని యిచ్చేను!
వంకాయ-మునగకాడ
వంటకు రుచికరమయ్యేను!
దోసకాయ కడుపులోని
దోషాలను అణగించేను!
క్యారట్-టమాట-బీట్‌రూట్
'హార్టు'కు మేలొనరించేను!
కాకరకాయ-నిమ్మకాయ
చక్కెరనే తొలగించేను
అందుకే కాయగూరలు
అందరు ఆరగించాలి!
పిల్లలు పెద్దలు ప్రతిరోజూ
ప్రీతిగా భుజియించాలి!



- డా॥ వద్దేపల్లి కృష్ణ
9246541699

## స్వాగతం శుభస్వాగతం...కొత్త సంవత్సరానికి........

శతకోటి బాధలను
మటుమాయం చేసే
వేయివసంతాలను
సుఖసంతోషాలను తెచ్చే
కోటి వరాలనిచ్చే
కొత్త సంవత్సరానికి
స్వాగతం శుభస్వాగతం...

కష్టాలులేని కన్నీళ్ల రాని
వ్యాధులు వ్యధలు
వేదనలు రోదనలు
బాధలు భయాలు
ఆందోళనలు ఆవేదనలు
అప్పుల తిప్పలు
అవమానాలు లేని
కొత్త సంవత్సరానికి
స్వాగతం శుభస్వాగతం...

స్వశక్తికి స్వస్తి పలకని
బద్ధకానికి స్వార్థానికి
స్వాగతం పలకని
సంకుచిత భావాలను
సమాధి చేసే
అభ్యుదయ భావాలకు
పునాది వేసే
కొత్త సంవత్సరానికి
స్వాగతం శుభస్వాగతం...

కష్టాలను కరిగించే
కారు చీకట్లు తొలగించే
వెన్నెల వెలుగులను పంచే
ప్రశాంత జీవితాన్ని ప్రసాదించే
కొత్త సంవత్సరానికి
స్వాగతం శుభస్వాగతం...

-పోలయ్య కవి కూకట్లపల్లి
9110784502



## బీడీ కార్మికులు

చిగురించిన ప్రయత్నంలో ఎదగని జీవితాలతో
కొమ్మ కొట్టిన తునికాకు చెట్లే వీళ్ళు
కత్తెరింపుకు దొరకని
ముడుతల రంధ్రాల ఆకుల కట్టలలో
రాబోయే కాలపు ఊపిరితిత్తుల ఎక్స్ రే ల ప్రతిబింబాలు
నాట్యం చేసే చేతి వేళ్లు
మునీం తీసి విసిరిన బీడీలను బిత్తరపోయి చూస్తుంటయి
ఎన్నో ఏళ్ల నైపుణ్యం
అయినా కుదర లేదన్న కట్టలు
టేకేదార్ లెక్కలలో కుదురుకుంటయి
ఆకు ఈనెలు లాగి నపుడయినా
వెన్నులో నరమేదో లాగుతున్న మాట
బయటకు రాదెందుకో

కార్మికులుగా గుర్తించబడని బాల్యం
మోకాళ్లపై కూర్చొని దారం చుడుతుంది
కార్ఖానాల్లో ముచ్చట్లకయినా నోచుకోని
పెద్దింటి ఒంటరి మహిళా కార్మికులు
రాతలు రాయాల్సిన చేతులకి పనులనందించి
చాట ముందేసుకున్న తల్లి దుఃఖంతో
తంబాకు తడియై బరువెక్కుతుంది
రేపయినా ఆకుల కట్టలు
మంచివి వస్తాయో రావో
తంబాకు తగ్గిస్తాడో ఏమో
రాత్రంతా కలత నిద్దుర



-డా కాచాపురం దుర్గాదేవి
7893093495

## నైవేద్యం

అయ్యా! ...దానం
గుడిముందు కేక
ఆగిపోయాను
దీనంగా ఎత్తిన చేతులు
నైవేద్యంగా నా కొబ్బరికాయ

## ఎంగిలి మొహాలు

అణ్వాయుధాల కోసం
శాస్త్రవేత్తల సమావేశం
మొహాలనిండా ఎంగిలి
అద్దంలో చూసుకుంటే
ఎదురుగా సామాన్యుడు

## త్యాగాల ఎత్తు

ఉందని మీసాన్ని మెలేయకు
కొలిస్తే నీ ఎత్తు ఆరడుగులే
కొలవడం మొదలుపెడితే
త్యాగాల్లో ఆమె ఎత్తు
ఒక సాష్టాంగ నమస్కారం

## అతిథినయ్యాను

సముద్రం అలలొచ్చి
పాదాలను కడుగుతున్నాయి
మనిషినై వచ్చినందుకు కాదు
తన తీరానికి
అతిథినైనందుకు



-డా. కె.జి. వేణు,
98480 70084

### నేటి నిజాలు




## రంగుల ప్రపంచం

అందమైన ప్రపంచం
అద్భుతమైన పట్టణ
ప్రాంతాలు
చూడముచ్చటైన
హరివిల్లు.

ఈ ప్రపంచంలో
పై పై రంగులకే
విలువ ఈ సమాజంలో
రంగే ప్రధానం జనాలకి.

విలాస జీవితానికి
బానిసై
అడ్డదారుల్లో యువత
లోకమంతా ఒక మాయ.

ఆమడ దూరంలో
సామాన్యమైన ప్రజలు
రంగుల ప్రపంచనికి.

-మిద్దె సురేష్
9701209355

## మోగనున్న బడిగంట

ఎట్టకేలకు మోగనుంది బడిగంట
అల్లరి మాయమై నిశ్శబ్దం ప్రతి ఇంట
పిల్లలందరికీ ఇక రోజు సదువులంట
కోవిడ్ నిబంధనలతో హాజరవ్వాలంట
నిత్యం హోం వర్కుతో కుస్తీ పట్టాలంట
బాలలే భావి భవిష్యత్తే ముద్దంట
పిల్లలు లేక బడి సిన్న బోయిందంట
నేడు పిల్లల రాకకై ఎదురు చూస్తుందంట
మూగబోయిన తరగతి గదులంట
మురిపెంతో ఆహ్వానం పలుకుతున్నాయంట
ఆటపాటలు లేక ఇంటనున్న పిల్లలకై
చేతులు చాచి పిలుస్తుంది మైదానమంట
ఆన్లైన్ క్లాసెస్ తో ఆటవిడుపు లేని పిల్లలంట
ఆనందంతో బడికి ముస్తబవుతున్నరంట



-యాదవరనీ చంద్ర
కాంత్ గౌడ్
9441762105

## నా తెలంగాణ

భూమాత హారమ్ము
శుకశాంతి తీరమ్ము
చెలువైన సారమ్ము
నా తెలంగాణ.

-అవుసుల భానుప్రకాశ్

## చదువులమ్మ

బాతమ్మనడిగి
బంతిపూలు తెచ్చా
కొంగమ్మనడిగి
కనకాంబరం తెచ్చా
చిలకమ్మనడిగి
చామంతులు తెచ్చా
కోయిలమ్మనడిగి
కాకడాలు తెచ్చా
ఉడతమ్మనడిగి
మల్లెపూలు తెచ్చా
కోడెమ్మనడిగి
సంపంగులు తెచ్చా
హంసమ్మనడిగి
మందారాలు తెచ్చా
పిచ్చుకమ్మనడిగి
సన్నజాజులు తెచ్చా
పూలన్ని మాలచేసి
చదువులమ్మకిచ్చా

-కయ్యూరు బాలసుబ్రమణ్యం
7780277240



## మన సంక్రాంతి

## నాటి సంక్రాంతి

ముంగిట రంగవల్లికలు
గుమ్మాలకు బంతిపూలు
మామిడాకుల తోరణాలు
ఇదే... మన సంక్రాంతి

ఇంటింటా గంగిరెద్దులతో
ప్రత్యక్షమయ్యే హరిదాసులు
బుడబుడకలవారి అంబపలుకు
జగదంబ పలుకు ఆశీర్వచనాలు
మన తెలుగు సంస్కృతిని
తేటతెల్లం చేసే సంప్రదాయాలు
ఇదే..మన సంక్రాంతి.

ఇంటినిండా కాంతులు
నవధాన్యాల మధ్య గొబ్బెమ్మలు
నువ్వులముద్దలతో తలంటడాలు
ఇది ...మన సంక్రాంతి
సద్ద రొట్టెలు కలగూరతో ఫలహారాలు
గారెలు పాయసాలతో ఘుమఘుమలు
సంతోషంతో పిల్లల కేరింతలు
ఇదే...మన సంక్రాంతి

భోగి మంటలతో మానసిక చైతన్యం
బొమ్మల కొలువుతో ఆహ్లాదం
గాలిపటాలతో పెరిగే ఆత్మ విశ్వాసం
ఇదే..మన సంక్రాంతి

ఊహాశక్తిని, సృజనాత్మకతని పెంచే పండగ
తెలుగువారిని క్రాంతిని శాంతిని పంచే
పండుగ తెలుగువారికే సొంతమైన పండుగ
ఇదే..మన సంక్రాంతి

## నేటి సంక్రాంతి

పొగ మంచుతో కూడిన
ఉషస్సు కానరాక
మసకబారిన ఉదయమే
మన కనులకు సరిగా ఆనక
సూర్య చంద్రులను నెలకు ఒకసారైనా
చూడలేని మనుషులు
పుట్టాక ఒక్కసారైనా
గంగిరెద్దు విన్యాసాలను
చూడని బాలలు
హరిదాసు అనే పదాలకు
అర్థం తెలియని యువకులు
అంతర్జాలాలముందు అతుక్కుపోయే
నేటి తరాలు
పొద్దున లేసి హడావిడిగా
పరుగులు తీసే ఉద్యోగులు
పాయసం,గారెలు అంటే తెలియని
నేటి పసివాళ్ళు
అవగాహన రాహిత్యంతో
తెలుగువారికే సొంతమైన ఈ పండుగను
నిర్లక్ష్యం చేస్తున్న వారిని మేల్కొలుపుదాము
పండుగలను అందరం స్వాగతిద్దాం
మనమందరం పాలు పంచుకుందాం



-బండారు సునీత
9440671530

## రాత - గీత

### వెలుగు

సమాజమనే
చీకటిగదిలో
మానవత్వమనే
వెలుతురుకై వెదికే
అంధున్ని
నేనొక పిచ్చివాన్ని!




### సవతులు

దారిద్ర్యపు
దయామయికి
ఆకలే ఆడబిడ్డలు
అవమానాలే అల్లుళ్ల
సంపదలే సవతులు.





రాత-శిల్పా జగదీష్
సెల్: 9290827384
గీత-వర్చస్వి



# పల్లె మట్టి పరవశం -సోమేపల్లి కవిత్వం !



-డా.ఉమ్మడిశెట్టి రాధేయ
సెల్:9985171411

కొన్ని కవితలు నాలుగు వాక్యాలు చదివీ చదవగానే ఆకవి టోన్ పాఠకునికి స్పష్టంగా తెలిసిపోతుంది.

మనం తరచుగా ఫోన్‌లో అవతలి వ్యక్తి స్వరం వినగానే ఆ వ్యక్తిని గుర్తుపట్టి ఆప్యాయంగా పలకరించి నట్లుగా...మనం ఏకాంతంగా ఆలోచిస్తూన్నప్పుడు ఒకనాటి బాల్యమిత్రుడు చాలా కాలం తర్వాత వెనుక వైపు హఠాత్తుగా వచ్చి తన అరచేతులతూ రెండు కళ్ళు మూసేసి నేనెవరో చెప్పుకో చూద్దాం అనగానే అతని అరచేతుల స్పర్శను, కంఠస్వరాన్ని గుర్తుపట్టి పేరుతో పిల్చినట్లుగా... కొంతమంది కవుల పేర్లు చూసుకోకుండా కవితలోని నాలుగు వాక్యాలు చదివీ చదవ గానే ఆ కవి టోన్ మనకిట్టే తెలిసిపోతుంది.

కారణం...

ఆ కవి తనదైన భావజాలం, రూపం, అభివ్యక్తి, శిల్పంతో మన మనసులో ఒక ప్రత్యేక ముద్రవేసి గుర్తుండిపో యుంటాడు ఇక్కడ కవిని కవిత్వమే పరిచయంచేస్తుంది.

కవి అవగాహనను బట్టి,దృక్పథాన్ని బట్టి,స్వభావాన్ని బట్టి అతని కవిత్వం రూపు దిద్దు కుంటుంది.

అతని భౌతిక జీవితానికి,సామాజిక జీవితానికీ ,మానవ సంబంధాల మధ్య పతన విలువల మధ్యలోంచీజాగృతమై కవిత్వం పుడుతుంది.

కొందరిది సున్నిత సుకుమార అంతరంగంలోంచీ మృదువుగా కదిలే అనుభూతులు సందడి చేస్తాయ్ అందరూ గొప్ప కవులుగా ఉండాలని నేననుకొను. ఒక్కొక్కరి అనుభూతులు అనుభవాలు భిన్నంగా ఉంటాయి.సున్నిత మనష్కులుగా కరుణాస్వభావులుగా తనదైన స్వరం విన్పిస్తూ,ప్రచారార్భాటం లేని కవులంటే

గారు కాకతాళీయంగా సాహిత్యం లోకి రంగప్రవేశం చేశారని తెలుస్తోంది.

మినీకవితల్ని తనవాహికగాచేసుకున్నారు.

తాను కవి అవుతానని,కవితలు రాస్తానని ఆయన అనుకోలేదు,ఆ దిశగా ఆలోచించనూ లేదు . చదువుకొన్నది కామర్స్ లో ,ఎంకామ్ ,సాహిత్యంతో సంబంధం లేని సబ్జెక్ట్ ,ఈ విషయం వారి మాటల్లోనే విందాం...

'నేను కవిత్వం రాయాలని కానీ, రాస్తానని కానీ ,ఎన్నడూ అనుకోలేదు. అసలు నాకు ఆ సబ్జెక్టు గురించి తెలియదు. నేను చదివింది కామర్స్.

ఆ తర్వాత కొన్నాళ్లు నా స్వగ్రామంలో వ్యవసాయం చేశాను తదుపరి హైదరాబాద్ ఆంధ్రజ్యోతి దినపత్రికలో మూడేళ్లపాటు(1986-88) సబ్ ఎడిటర్ గా ఉద్యోగం చేశాను.

ఆ కాలంలోనే తెలుగు సాహిత్యం చదవడం అక్కడక్కడా నగరంలో జరిగే సాహితీ సభలకు హాజరు కావడం చేసేవాణ్ని. పత్రికకు వార్తలు' చిన్న చిన్న కథలు' జోకులు' రాసేవాణ్ణి అంతేగాని కవిత్వం గురించి ఏమీ తెలియదు.

1989లోగ్రూప్2 పరీక్షపాసై రెవెన్యూ శాఖలో డిప్యూటీ తాసిల్దార్ గా ఉద్యోగం వచ్చింది .

1991 నుంచి మండల రెవెన్యూ అధికారి గా పని చేస్తున్నాను నాకు ఎప్పుడైనా ఖాళీ సమయంలో ఏదైనా ఆలోచన తట్టినప్పుడు వాటికి వాక్య రూపం అందించాను.

అలానేను రాసుకున్న వాక్యాలు కవితలుగా రూపుదిద్దుకున్నాయి .

అలా మొదలైంది నా కవిత ప్రయాణం."

(1997 లో తొలి కవితాసంపుటి "లోయలో మనిషి'నుండి తన పరిచయం చేసుకుంటూ (పుట.12)



సోమేపల్లి వెంకట సుబ్బయ్య రచించిన తొలి కవితా సంపుటి "లోయలో మనిషి" ఆవిష్కరణలో ప్రముఖ కవులు రస రాజు, అద్దేపల్లి, బేతవోలు రామ బ్రహ్మం తదితరులు

నాకు చాలా ఇష్టం.

ఇలాంటి అరుదైన కవి, పటాటోపం లేని కవిగా సోమేపల్లి వెంకట సుబ్బయ్య గారిని నేను ఇష్టపడతాను. రెవిన్యూ శాఖలో డిప్యూటీ కలెక్టర్ గా, అత్యంత కీలకమైన ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే తన హృదయ గది ఒక అరను కవిత్వం తో నింపుకున్నారు సోమేపల్లి గారు.

తెలంగాణా లోకూడా ఇదే కీలక హోదాలో ఉన్న ఏనుగు నరసింహారెడ్డి గారు కూడా అత్యద్భుతంగా కవిత్వం రాస్తూ తన పదవికే వన్నె తెస్తున్నారు.

ఇలాంటి వారిని చూస్తుంటే,తలుచుకుంటే నేను చాలా గర్వంగా ఫీలవుతాను.

ఇవాళ విస్తృతంగా కవిత్వం రాస్తూ,ముందు వరుసలో ఉన్న కవుల్లో సోమేపల్లి లేకపోవచ్చు గానీ ముందు చూపున్న కవుల్లో వీరు తప్పక ఉంటారు.

1997 నుంచీ 2019 దాకా వీరి కలం విశ్రాంతి తీసుకోలేదు.అంటే 23 ఏళ్లుగా కవితా ప్రయాణం సాగిస్తూనే ఉన్నారు.

1975-80 మధ్య కాలం లో మినీకవిత పేరుతో ఒక వచన కవిత్వం లోనే ఒక అధునాతన ప్రక్రియ గా మినీ కవిత రూపంలో రూపుదిద్దు కొని విస్తృత ప్రచారంలో ఉండేది.

యువతరం నవతరం నుండి పేరొందిన పెద్ద పెద్ద కవులు కూడా దీని ప్రభావం నుండి తప్పించుకోలేక పోయారంటే నమ్మండి

ఒక వైపు కొల్లూరి,అద్దేపల్లి ,రావిరంగా రావు ,నేను ,జీవిపూర్ణచందు, మాధవీ సనారా మొదలైన కవులంతా మినీ కవితలు రాస్తూ విస్తృత ప్రచారం కల్పించాం.

ఈ ప్రచారంలో అద్దేపల్లి రామమోహన రావు గారు ఆంధ్ర దేశ మంతా పర్యటిస్తూ,సభల్లో ప్రసంగాలు చేస్తూ యువకుల్ని మినీ కవితల వైపు మళ్లించారు.

డా.రావిరంగారావు మరింతగా ముందుకు దూసుకెళ్లి యువకుల్ని,విద్యార్థుల్ని బాగా ప్రోత్సహించి శిక్షణాశిబిరాలు ఏర్పాటు చేసి,వారికోసం పుస్తకాలే రాసి,వారిలో మినీ కవితా చైతన్యం నింపారు.

ఇంక అలిశెట్టి ప్రభాకర్ గారైతే తాను మంచి చిత్రకారుడు గనుక తను రాసిన మినీకవితలకు భావ స్ఫోరకమైన చిత్రాలు వేసి వాటిని చార్టులు గా తయారు చేసి సాహిత్య సదస్సుల్లో వాటిని ప్రదర్శించే వారు.అవి అందర్నీ ఆకట్టుకొనేవి.

నేనూ,నా మిత్రుడు తేజస్విత గారు మా కవితలను మా మిత్రుడు ఆర్టిస్ట్ భాస్కర్ తో బొమ్మలు గీసి రాయల సీమ అంతటా ప్రదర్శించాం.మా యౌవనపు తొలిరోజుల ఉత్సాహం అలా ఉండేది.

మా మినీ కవితలన్నీ పురాణం సుబ్రహ్మణ్యం గారు ఆంధ్రజ్యోతిదినపత్రిక లో ప్రచురించి ఆనాటి యువతరాన్ని చైతన్య పర్చారు.

198ని లో కొల్లూరి గారు 300 మంది కవుల మినీకవితలతో "మినీకవితా విప్లవం" పేరుతో ఏకంగా ఒక పెద్ద సంకలనం తెచ్చి తెలుగు కవిత్వం లో ఒక పెద్ద సంచలనం సృష్టించారు.మొదట ఈ ప్రక్రియను కుందుర్తి గారు వ్యతిరేకించినా తర్వాతఆమోదించడం జరిగింది.

మినికవిత వచన కవిత నుండి ఏర్పడిందే ,అది ఒక ప్రక్రియే గాని ఉద్యమం ఎలా అవుతుందని సీనియర్ సాహితీ వేత్తలంతా చర్చలు చేశారు, విమర్శనా వ్యాసాలు రాశారు.మొత్తం మీద మినీ కవిత ఒక దశకం పాటు ఒక పెద్ద తుఫాను సృష్టించింది.

సరిగ్గా ఈ సంధి కాలం లోనే మన కవి సోమేపల్లి

## సోమేపల్లి గారి జీవన నేపథ్యంలోంచీ మరిన్ని వివరాలు....

వీరు 1958 సం.లో ప్రకాశం జిల్లా,యద్దనపూడి మండలం లోని గన్నవరం గ్రామంలో ఒక రైతు కుటుంబంలో జన్మించారు.

1989లో గ్రూప్ 2 పరీక్షలో ఉత్తీర్ణులై డిప్యూటీ తాసిల్దార్ గా ఉద్యోగంలో ప్రవేశించి అంచె లంచెలుగాపదోన్నతులు పొందుతూ డిప్యూటీ కలెక్టర్ గా, ఆర్డీఓగా, గుంటూరు జిల్లాపరిషత్ ముఖ్య పాలనాధికారి(అఖా)గా 2018 లో పదవీ విరమణ చేశారు.

2017 లో గుంటూరు జిల్లారచయితల సంఘం స్థాపించి,దానికి వ్యవస్థాపక అధ్యక్షులు గా వ్యవహరిస్తూ అనేక సాహిత్య కార్యక్రమాల్ని నిర్వహిస్తూ రచయితలని ప్రోత్సహించారు.

రాష్ట్రం విడిపోయాక 2015 సెప్టెంబర్ 13న ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం స్థాపించి, అధ్యక్షులు గా కొనసాగుతూ,రాష్ట్ర స్థాయిలో అనేక సాహితీ సదస్సులు,

కవిసమ్మేళనాలు,కవులకు,కథకులకు శిక్షణా శిబిరాలను ఏర్పాటుచేసి,రాష్ట్రం

లోని రచయితలను చైతన్య పర్చడం లో తనవంతు పాత్రను నిర్వహించారు.

మొదట స్వీట్ చిట్,రంగుల ప్రపంచంలో అమ్మ,ఆశకు ఆవలి వైపు,కథాకేళి,ఇంతే సంగతులు మొదలైన కథలు రాసి సాహితీ రంగప్రవేశం చేశారు.

వారి తల్లిదండ్రుల స్మృత్యర్థం 2007 లో సోమేపల్లి సాహితీ పురస్కారం స్థాపించి ప్రతి ఏటా జాతీయ స్థాయిలో చిన్నకథల పోటీలు నిర్వహించి విజేతలకు పురస్కారం అందజేస్తున్నారు.

వీరి రచనలకు,సాహితీసేవకు గుర్తింపుగా ప్రభుత్వం ద్వారా,వివిధ సాహితీ సంస్థల ద్వారా అనేక పురస్కారాలు అందుకున్నారు.

## సోమేపల్లి వారి రచనలు!

1. లోయలో మనిషి (1997)
మినీ కవితా సంపుటి
2. తొలకరి చినుకులు (2001)
నానీలసంపుటి
3. చల్లకవ్వం ( 2002 )
కవితా సంపుటి
4. రెప్పల చప్పుడు (2004)
నానీల సంపుటి.
5. తదేక గీతం (2006)
కవితా సంపుటి
6. పచ్చని వెన్నెల (2007)
నానీల సంపుటి
7. మట్టి పొరల్లోంచీ (2016)
కవితా సంపుటి
8 .చేను చెక్కిన శిల్పాలు (2019)
నానీల సంపుటి

ఇవి కాక సోమేపల్లి సాహితీ పురస్కార కథలు..2012 లో మరియు 2017లో.

### కవి భావాల పునాది గా "లోయలో మనిషి"1997

కవి తన జననీ జనకులకు అంకిత మిచ్చిన ఈ తొలి



ఏప్రిల్ 27, 2008న గుంటూరులో రాష్ట్రస్థాయి శతాధిక మహిళా కవి సమ్మేళనను ఘనంగా నిర్వహించినందుకు సోమెపల్లి వెంకటసుబ్బయ్యను సత్కరిస్తున్న ప్రముఖ కవయిత్రులు డా॥సి. భవాని, ఎన్. అరుణ, డా॥ఎన్.గోపి, బైస దేవదాసు తదితరులు.



"చల్ల కవ్వం" కవితా సంపుటిని ఆవిష్కరించిన డా॥ నాగ భైరవ కోటేశ్వరరావు.చిత్రంలో తాతిన రామ బ్రహ్మం, తోటకూర వెంకట

కవితా చిరు సంపుటి లో 26 కవితలతో పాకెట్ సైజులో కన్నా కాస్త పెద్దది గా ముచ్చటగా ఉంది.

ఇందులో ఎక్కువగా మినీ కవితలు చోటు చేసుకున్నాయి.తొలి కవితలోనే ఆత్మసౌంర్యానికే అధిక ప్రాధాన్యం అన్నాడు.కట్నం చట్టానికే పరిమిత మైందని

బాధపడ్డాడు.ఒక రైతుబిడ్డగా చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడే రైతునురాశాడు.

**"అటు అప్పుల బాధ**
**ఇటు ఆకలి ఘోష**
**ఆటు పోటు తట్టుకునే**
**స్థయిర్యం లేదు**
**చావో బతుకో తేల్చుకోలేక**
**చచ్చి బతుకుతున్నాడు"** పుట.. 25

గాంధీ పుట్టిన దేశం మనది,కులం వైపే మొగ్గు




చూపుతుంది.ఉన్నాడో లేడో నని దేవుని గురించి వాదన లెందుకు?మానవత్వాన్ని దైవత్వంగా భావించ మంటాడు. రెక్కల కష్టం రైతుది, పంట దిగుబడి లో దళారీదే హస్తం.

**"దుక్కి దున్ని నేను**
**మట్టి పిసికింది నేను**

**వీరి రచనలకు,సాహితీసేవకు గుర్తింపుగా ప్రభుత్వం ద్వారా, వివిధ సాహితీ సంస్థల ద్వారా అనేక పురస్కారాలు అందుకున్నారు.**

**రేయింబవళ్ళు**
**రెక్కలు ముక్కలు**
**చేసుకుంది నేను**
**పంట డబ్బు పట్టు కెళ్ళింది మాత్రం.. దళారోడు"**
పుట..38

మనిషి నైతిక విలువలు పతనం అంచున వేలాడుతు న్నాయనీ, అబలకు రక్షణ కరువైందని విలువలు కోల్పోయి. లోయలో పడిపోయాడనే కవి ఆవేదనే ఈ తొలి కవిత్వం.

### కమ్మని తలపులు 'తొలకరి చినుకులు' (2001)

తనలో కలిగిన భావనలే ఈ తొలకరి చినుకులు. ప్రముఖ కవి ఆచార్య ఎన్.గోపి గారు ఈ నానీల రూపశిల్పి.వారి మేథోమతనంలో రూపుదిద్దు కున్న ప్రక్రియే నానీలు .ఇది జనరంజక ప్రక్రియగా మారి అతి స్వల్ప కాలం లోనే కవులందరూ ఈ నానీల ప్రేమలో పడ్డారు ప్రసిద్ధ విమర్శకులు ఆచార్య రాచపాలెం గారు కూడా "సీమ నానీలు" రాయడం గమనార్హం.వందలాది నానీల సంపుటాలు వెలువడ్డాయి.తెలంగాణ కవులు ఈ ప్రక్రియ ను బాగా పట్టుకున్నారు.

అయితే నానీల సృష్టికర్త గోపి గారు నానీల రచనకు కొన్ని మౌలిక సూత్రాలను కూడా ప్రతిపాదించారు. కొందరు యువకవులు ఆ సూత్రాల్ని పక్కన పెట్టి కేవలం వాక్యాలనే ప్రాతిపదికగా ఎంచుకొని నానీలు రాస్తున్నారు,సంపుటాలు తెస్తున్నారు.

నాకు గోపిగారి నానీల కంటే వారి వచన కవిత్వాన్నే బాగా ఇష్టపడతాను. అతి సరళంగా,చక్కటి భావుకత్వంతో ఎటువంటి వస్తువునైనా ఆర్ద్రంగా కవిత్వీకరించడం వారి ప్రత్యేక కవితా శైలికి నిదర్శనం.




వారి కవితా శైలిని గురించి నేను "అవగాహన" మొదటి సంపుటి లో సుదీర్ఘంగా విశ్లేషించాను.

ఒకప్పుడు మినీకవితలు బాగా రాసి ప్రచారం చేసిన నేను తర్వాత ఈ లఘు ప్రక్రియల వైపుకి మళ్లలేదు.వీటి కాన్వాసు చిన్నది.విషయ విస్తృతికి ఇందులో అవకాశం ఉండదు.

అయితే అల్పాక్షరాల్లో అనల్పార్థ రచనకుఈ లఘు ప్రక్రియలు సరిపోతాయి.ఏది ఏమైనా మన సోమేపల్లి గారు నానీల శైలినిచక్కగా పట్టుకున్నారు.అందరి మెప్పును సాధించారు.

గోపి గారన్నట్లు నానీలు రాసిన తొలికవిగా ఎస్సార్ బల్లం గారికి గుర్తింపు వచ్చిందని మలి కవిగా సోమేపల్లి గారికి ఆ గౌరవం దక్కడం సంతోషాదాయకం.

కవి గారి అర్థాంగి విజయలక్ష్మి గారికి అంకిత మియబడిన శత నానీల సంపుటి 'తొలకరి చినుకులు' గా వర్షించాడు.ప్రతి నానీ కింద భావయుక్త చిత్రాలు పాఠకుల్ని అలరిస్తాయి.

**అందమైన అల్లిక కు ఆదర్శం**
**సాలెపురుగా..**
**కాదు -**
**కమ్మని కవిత్వం ..!!** పుట..1

**చల్ల కుండలో**
**కవ్వం తందనాలు**
**బుడత నోట్లో**
**వెన్న బుడగలు** పుట..2

**బూడిదంటే-**
**చులకన ఎందుకు..?**
**అది -**
**జీవితపు తుది జాడ-!** పుట..4

**గోరు ముద్దల**
**గొంతుక కి**
**అమ్మ చేతి చలువ**
**ఎపుడూ గురుతే-** పుట..8

**బాధల గాథలు**
**మరవాలంటే**
**బంగారు బాల్యానికి**
**బందీ అవాల్సిందే** పుట..9

**పల్లె దనం**
**చల్లని సద్ది బువ్వ**
**పట్నవాసం**
**వేడివేడి ఫాస్ట్ ఫుడ్** పుట..12

**పుస్తకం**
**మస్తకానికి చేరువలోనే**
**ఒంటరితనం**
**నన్నేమీ చేయలేదు** పుట..18

**రక్తానికీ**
**గ్రూపులున్నాయి**
**పాపానికి**
**పలు మార్గాలున్నట్లు** పుట..19

**చెట్టును**
**నాటి చూడు**
**కాలుష్యం గొంతులో**
**సుగంధ మై పరిమళిస్తుంది** పుట.. 21

**చెలిమికి**
**చిరునామా**
**మనిషిని తడితే**
**మనసు పలుకుతుంది** పుట..34

ఇందులోని ప్రతి నానీ ఒక సామాజిక వాస్తవం. వాస్తవిక వ్యంగ్యం.

ప్రతి నానీ సూటిగా,స్పష్టంగా పాఠకుని మనసును తాకుతుంది

### మానవతా విలువల మథనం చల్లకవ్వం(2002)

32 కవిత్వ వెన్నముద్దల్లాంటి కవితలతో అలరించిన వచన కవిత్వమే చల్లకవ్వం.

విశ్వంభర కృతికర్త డా.సినారె ఇది దేశీయత, ఆత్మీయత ఆర్ద్రంగా పొదిగిన కవిత్వమని ప్రశంసించారు.

జాతీయకవి, "కవనవిజయం" రూపశిల్పి

డా.నాగభైరవ గారు ఈ సంపుటి కి ముున్నుడి రాస్తూ..ఇది పల్లెటూరి మట్టి పరిమళాల కవిత్వమని కితాబిచ్చారు.

అందులోనూమినీకవితల,నానీల సంపుటాల తర్వాత పూర్తి వచన కవితలతో వచ్చిన వచన కవితల సంపుటి.

ఈ కవి రెవిన్యూ శాఖలో ఉన్నతోద్యోగి కదా

తొలిక వితే గ్రామసేవకుల జమాబందీ ని కవిత్వం చేశాడు

**"జనాభా లెక్కల దగ్గర్నుంచి**
**జన్మభూమి పనుల వరకూ**
**అందరికీ**
**అతడెప్పుడూ తక్షణ జవాబుదారే**
**బాధ్యతల అరువుల బరువుల్ని మోస్తూ మాసూళ్ల కాలం లో**
**తాసీలు కోసం తహతహలాడే**
**అతడెపుడూ నిత్యసేవా జాగృత దీపమే**
**చేసేది చిరుద్యోగమైతేనేం**




**కలిమి చెలిమి లోనే కాదు**
**నిత్య సేవా తత్పరతకి**
**నిరుపమాన చిరునామాయే అతడు'**
పుట..16

తల్లి మట్టిని కళ్లకద్దుకోవడంలో,నా దిన చర్య మొదలౌతుంది.మట్టి పొట్టలో మళ్ళీ మనిషిగా పొటమరిస్తానంటున్న కవి.

నవీన దేవాలయం గా గ్రంథాలయాన్ని కళ్లకద్దు కుంటాడు కవి.

"వెలుగు దిక్సూచిగా
భుజం తట్టే భరోసాగా
బాధ మరిపించే నేస్తంగా
పుస్తకమే అవుతుంటే
గ్రంథాలయమే నవీన దేవాలయం".. పుట..63

ఇలా ఈ "చల్లకవ్వం" కవితా సంపుటి కవి జ్ఞాపకాల్ని,అనుభూతుల్ని ఆవిష్కరిస్తుంది.

### కవి గుండెల్లో అలజడులు రెప్పల చప్పుడు నానీలు (2004)

"తొలకరి చినుకులు" తర్వాత రెండవ నానీల సంపుటి ఈ "రెప్పల చప్పుడు'

ఈ నానీల్లో అభివ్యక్తి పరంగా మరింత పరిణతి సాధించారు.ఇందులో పల్లె రుణం,నగర విముఖత్వం, రాజకీయాల పట్ల వ్యంగ్యాత్మక విసుర్లు కనిపిస్తాయి.

సంక్రాంతీ కాదు
క్రిస్మస్ కాదు
అన్నం దొరికిన్నాడే
నిజమైన పండగ పుట.. 2

నాగలీ, గొర్రూ
జడ్డిగమూ..
ఇవన్నీ పెట్టాల్సిందే-
ఇక మ్యూజియంలో.. పుట..3

పచ్చని చెట్లు
తెల్లబడ్డాయా?
ఓహో తెలిసింది..
కొమ్మకొమ్మకూ కొంగలు పుట..6

ఊరిలో
నీటికి కటకట
మరి చుట్టూ
చేపల చెరువులే పుట..14

నదీ పుస్తకానికి
అలలే పుటలు
కిరణాలే
అక్షరాలు
పుట..15

వెండితెరమీద
జీవిస్తాడు
జీవితంలో మాత్రం
నటిస్తాడు పుట..20

నోరెండిన
చెరువులూ కాలువలూ




నీరెండిన
రైతుకళ్ల నెర్రెలు పుట.. 25

కమ్మరి కొలిమి
ఆరింది గానీ
గుండె కొలిమి మాత్రం
చల్లారలేదు పుట..27

ఇలా ఇందులోని నానీలు చమత్కారంగా,వ్యంగ్యంగా ,సామాజికంగా ఉన్నాయి.




"తదేక గీతం" కవిత సంపుటిని ఆవిష్కరించిన ఆచార్య ఎన్.గోపి.చిత్రంలో పాపినేని శివశంకర్, పెనుకొండ లక్ష్మి నారాయణ, శ్రీమతి ఎన్. అరుణ

అప్పుడప్పుడు జ్ఞాపకాల అలల్లో తెలియాడుతూ ఆ మధురానుభూతుల్ని

మళ్లీ మళ్లీ నెమరేసుకుంటాడు.

**"పదిహేడో ఎక్కంఎక్కం తప్పుకు..**
**పంతులు గారు పెట్టిన తొడపాశమూ**
**బడి ఎగ్గొట్టి**
**ఊర చెరువులో ఈత కొట్టినప్పుడు**
**రుచి చూసిన**
**ఈత బెత్తం చురుకు చురుకు దెబ్బలూ**
**జ్ఞాపకాల అల్మారాలో చెక్కుచెదరలేదు**
**ఉత్తుత్తి పరాచికపు ఆటల పోటీల్లో**
**టెంకి జెల్ల తినిపించిన ఆ పిల్లే**
**మళ్లీమళ్లీ గుర్తొస్తోంది నా హృదయ క్యాలెండర్లో పేజీలు చినగవుచిన్ననాటి చిలిపి నేస్తాల్ని ఎలా మరుస్తాను"** పుట..20

అనుమానాలు ,మూఢ నమ్మకాలు మనిషి బతుకుని శాసించడం తప్పంటాడు విస్తరించే విజ్ఞానాన్ని స్వాగతించ మంటాడు.

2001లో జరిగిన గుజరాత్ భూకంపానికి చలించి పోతాడు.

మట్టి కుదుపును
లెక్కకట్టే రెక్టర్ స్కేలు
కన్నీళ్లను కూడా కొలవగలిగే
గుండె పగిలి చావదూ..
ఈ సైబర్ లో కం ! పుట..22

ఎయిడ్స్ కోరలకు చిక్కని బతుకులే పచ్చదనం తో పరిమళిస్తాయని భావిస్తాడు

సిరిసిల్ల లో అప్పులతో,ఆకలితో చేనేత బతుకులు బుగ్గి పాలౌతుంటే కలత జెందుతాడు.

"తడిసిన పడుగులాంటి అప్పులతో "సాలెగూడు" మార్కెట్లో

"నేతగాడు" అభిమన్యుడే అవుతున్నాడు మగ్గం చక్రం ఏకబిగిన తిరుగుతూన్నా బతుకు పగ్గం పుటుక్కున తెగిపోవడం సర్వసాధారణమైపోయింది" పుట..27

బాడుగజీవికి ఓనరు లేని ఇల్లే ఉత్తమం అంటాడు.అమ్మతనాన్నవదిలించుకోవడంలో ఇవాళ ఆడశిశువు వ్యాపారానికి ముడిసరు కైంది.

ఎప్పుడైనా తీరికగా పల్లె పాదాల్ని స్పర్శించడం కవికిష్టం పరుల కోసం పాటుపడని బతుకు వృథా అంటాడు.

ప్లాస్టిక్ ను వాడకమంటే "మన పాడె"ను మనమే సిద్ధపర్చుకోవడమే నంటాడు.

తన బతుకును తీర్చి దిద్దిన గురువును అక్షర శిల్పి గా గుర్తుంచుకున్నాడు.

షుగర్ ను చక్కెర సర్పంగా భావిస్తాడు.ఏమాత్రం ఏమారినాఈ సర్పం కిడ్నీలను కాటేస్తుందని హెచ్చరిక చేస్తాడు.

అనుబంధాలు ఆర్థిక బంధాలై విస్తరిస్తున్న నేపథ్యంలో పల్లె ఒడిలో పండుటాకులు

బరువైనాయి.నగరంలో ప్రతివీధీ వృద్ధాశ్రమమే నంటాడు.

పేపర్ బాయ్ సైకిల్ చక్రమే తన జీవిత గమనాన్ని నిర్దేశిస్తుందంటాడు.కన్న ఊరుని,ఇంట్లోని ట్రంకు పెట్టెను ,కంప్యూటర్ యుగంలో కాలం చెల్లిపోయిన ఉత్తరాన్ని మరువలేక పోతున్నాడు కవి.

### పల్లె సీమ ముఖ చిత్రం "తదేక గీతం" (2006)

ఊరు ఊరంతా ప్రేమతో అల్లుకు పోయే చిత్రాలు,మట్టి కుదుళ్లలో మమతలు పూసే

మమతలు పూసే మందారాలూ, మనుషుల పలకరింపుల్లో పరిమళించే మమతల మల్లెల సుగంధం

(మిగతా 5వ పేజీలో

**"అలిశెట్టి ప్రభాకర్ గారైతే తాను మంచి చిత్రకారుడు గనుక తను రాసిన మినీకవితలకు భావ స్ఫోరకమైన చిత్రాలు వేసి వాటిని చార్టులుగా తయారు చేసి సాహిత్య సదస్సుల్లో వాటిని ప్రదర్శించే వారు.అవి అందర్నీ ఆకట్టుకొనేవి"**

## నవలోకం

నవ్య లోకంలోకి అడుగిడుతున్నా...!
వినూత్న ఆలోచనలను మెదడుకెత్తుకొని..
వినమ్ర చరితను లిఖించుకోవాలని..

అహంకారపు చితిలో కాలిపోకుండా
అసూయల ప్రవాహంలో కొట్టుకుపోకుండా
అచలాన్నై ఆదర్శంగా నిలుస్తాను

అస్తిత్వపు అమరసౌధం నిర్మించుకుంటున్నా..!
సాహిత్యాన్నే పునాదిగా భావిస్తూ..
స్నేహపు కుడ్యాలను పేర్చుతూ..

నిరంతర వాహినిలా గమిస్తున్నా
నిత్యసవాళ్లను ఎదుర్కొంటూ
నవజీవన రాగం ఆలపిస్తూ



-అయిత అనిత
8985348424

## నానీలు

అనుభవాలే
గురువులు!
నూతన పాఠాలను
ఉద్బోధిస్తూ...!!

అనుభూతి చెందాకే
తెలిసింది...
అమ్మతనంలోని
మాధుర్యము !!

ఓసారలా
వెనుదిరిగి చూడు...
ఎన్ని
అనుభవాల పుటలో...!

స్వార్థపు తెర
కరిగింది!
కరోనా నేర్పిన
పాఠాల సారంతో...!!

కమ్మనైన
చేతి వంట...!
అమ్మ చేయి ఎన్ని
చురకలను చవిచూసిందో...!!

హృదయమెంతో
దృఢపడింది!
ఎన్నో తుఫానుల
తదుపరి!!

మౌనపు
బలం తెలిసొచ్చింది!
వాక్యుద్ధ ఫలితం
చవిచూసాక!

ఏరుతూనే ఉన్నా
జ్ఞాపకాల సంచీలో...
తీపి
చక్కెర గుళికలను!

అనుభవిస్తేనే
తెలిసొచ్చేది...!
గాయాల బాధైనా...
సంతోష సుధలైనా...!!

రంగరిస్తూనే
ఉండాలి!
అనుభవసారంతో
అవసరానికో ఔషధం!

ఎన్ని
ఆనందాల విరులో...!
మన ఇరువురి
అనుభవాల తోటలో...!!

అనుభవమే
నేర్పుతుంది!
మమతల చేలోని
కలుపునెలా ఏరేయాలో...!!



-వెగ్గలం ఉషశ్రీ
9440370066

## నిజాలు..

సముద్రలో
అలలు
నిదురలో
కలలు
కొందరి స్వప్నాలు
ఫలిస్తాయి
మరికొందరివి
ఉట్టికెక్కుతాయ్!

నిన్నలోంచి
నేడు
నేడు లోంచి
రేపు -
కాలచక్రం
అనంత వాహిని
పరిణామం
ప్రకృతి ధర్మం!

ఆస్వాదించే
మనసుంటే
ప్రతి క్షణం
ఓ సజీవ పుష్పం -
ఆలోచనలు
చిలికే కవ్వాలు
అనుభవాలే
మైలు రాళ్లు!

మహాత్ముని
జీవిత చరితం
అమూల్య
సందేశామృతం
అహింసా మార్గం
ఆదర్శ పథం
సత్యశోధనం
జాతికి బలం!

ప్రపంచం
నిదురించే వేళ
నీరవ నిశ్శబ్దం
నిదురలేస్తుంది -
ధ్యానం
శక్తికి మూలం
మౌనం
నిజ ఆభరణం!

ఒక్కోసారి
పురుషుల పర్సులు
ఖాళీ అయినా
స్త్రీల దగ్గర కానేకావు -
పొదుపే
మదుపు
పోపుల పెట్టి
కాసుల ఖజానా!

తాళం కప్ప గొప్పదై
ఏం లాభం
తలుపు కూడా
గట్టిదై వుండాలి -
కుసంస్కారం
ఇంటి దొంగ
మాటల డాబే
చేతలు మట్టి!

దేవుడిపై
కడు భక్తితో
పట్టువస్త్ర
వేషధారణ -
అంతరంగం
మురికి కూపం
వ్యవహారం
అత్తరుమయం!

తమ బాగు
కోరుకునే వారు
ముందు.. ఇతరుల
బాగు కోరుకోవాలి -
అందరూ
బ్రతికి బట్టకడితేనే
మన
బ్రతుకులో పండగ !

పని చేసినా
చేయక పోయినా
కాలం
ఎవరి కోసమూ ఆగదు -
కాలం
పచ్చి నియంత
మనందరి బాటల
శాసన కర్త !

నిన్న గ్రామంలో
మనిషిని
నేడు నగర నీడలో
మర మనిషిని -
గానుగెద్దు
జీవితం
యాంత్రీకరణ
వ్యక్తిత్వం !

మనందరి
జీవితాలలో
అమృత ప్రాయం
బాల్యం -
ఏ మకిలి అంటని
పవిత్ర సమయం
పసితనం
పసిడి వాకిలి!

ఎదుట వారిలోని చెడును
వెతుకుతున్నంత కాలం
వారిలోని మంచి
మనకు కనపడదు -
తుచ్ఛ
భావన
తురుపు
ముక్క!

సమస్యల సునామీలు
ఎదురు దెబ్బల
వడగాల్పులు
ఎంతటి వారినైనా
కుంగదీస్తాయి -
సంతోషం
పడవ తెడ్డు
ధైర్యం
లైట్ హౌస్!

ప్రచారం
ఎప్పటికీ
గొప్పతనానికి
వెన్నుముక కాదు -
వజ్ర కాంతి
ధగధగలకే
ప్రపంచం
దాసోహం!

అంతర్జాల
సౌలభ్యంతో
అరచేతిలో
సమస్త ప్రపంచం -
ఇంటర్నెట్
సాధనా వినియోగం
మహేంద్రజాల
మహా మంత్రం!



-వంగర.
పరమేశ్వరరావు
9491400534

## 'కన్నీటి' కథలు

శల్యమౌతున్న
ఎముకల సాక్షిగా
క్షయమౌతున్న
దంతాల సాక్షిగా
నిర్వీర్యమౌతున్న
ఆయుష్షు సాక్షిగా
నాయకులు రాసిన
తలరాతల సాక్షిగా
గరళమైన మా ఊరి
నీరు సాక్షిగా
చిద్రమౌతున్న
మా బ్రతుకుల సాక్షిగా
దూరమౌతున్న
మా బాల్యం సాక్షిగా
మృగ్యమౌతున్న
మా చదువుల సాక్షిగా
తరుముతున్న మహమ్మారి
ఫ్లోరైడ్ సాక్షిగా....
కన్న ఊరుని వదలలేక
ఉన్న నీరుని తాగలేక
మైళ్లదూరంలో నీళ్ళు తేలేక
పడుతున్న నీటి వెతలు
చరిత్రలో నిలిచే కన్నీటి కతలు..



-కయ్యూరు బాలసుబ్రమణ్యం
9441791239

## కాటికెళ్ళేవరకు అదే ఆశ

సమయమంతా నాదేనని
కలియుగమంతా నేనేనని
ఇంద్రజాలం ప్రదర్శిస్తూ..
నరుడే వాహనమై తిరుగుతుంది

మనుషుల మధ్య దూరాన్ని పెంచి
మమతానురాగాలను తుంచి
మంచిని చెడు చేస్తూ...
చెడును మంచనిపిస్తూ...
మానవత్వానికి సంకెళ్లేస్తుంది

ఉన్నవాడి వెంటే దర్పమంటూ
లేనివాడిదే త్యాగమంటూ
రోగాలు నాకు చుట్టాలంటూ
అన్నిటికీ నాతోనే యోగమంటూ
జగతి రథమై, మనిషికి ఇంధనమై
ఈ ప్రపంచాన్ని నడిపిస్తుంది.

జీవిత సంఘర్షణలన్ని నాతోనే మొదలు
నాకోసమే మొదలు, నేను లేకనే ఈ దిగులు
ప్రతి ఒక్కరికీ నా మీదే ధ్యాస, నేనే శ్వాస
చివరికి కాటికెళ్ళే వరకు కూడ అదే ఆశ



-శ్రీతరం బింగి
శ్రీకాంత్
7893613015

## విశ్వ గురువు మన అవని

అనాగరిక అజ్ఞాన చీకట్లలో లోకమంతామగ్గుతున్నప్పుడు
ఉపనిషత్తులను విజ్ఞాన తోరణాలుగా మలిచి
వేదాలను వెలికి తెచ్చి
జ్ఞాన భిక్ష పెట్టిన విశ్వ గురువు నా అవని.
స్మృతులను చేదుకోవాలన్న ఆశ పుడితేచాలు
ఓంకారనాదంతో ప్రతిధ్వనిస్తూ
కోటి సూర్యకాంతులతో శోభిల్లే చరిత్రల తో
ఎన్నెన్ని వీరగాథలో చరిత్ర గర్భంలో.
హిమ నగము లే పెట్టని కోటగోడలై
పొంగిపొరలే నదులన్నీ తల్లి మెడలో
హారాలై శోభిల్లేరత్నగర్భ
భారత ఖండం ఓ అమృత భాండం
కుల ప్రాంత వర్గ మత భాషా భేదాలు ఎరుగక
భిన్నత్వంలో ఏకత్వమై నడిచే వసుదైక కుటుంబం .

కర్షక రుధిరాన్ని శ్రమ స్వేదం గా అద్దుతూ
హరిత సొగసుల సృష్టించే మెతుకు బ్రహ్మలు మొదలు
విలువల వలువలు గా కప్పుకుని
విశాల భావాలకు పరుగు నేర్పి
కావ్య కన్యక లకు పురుడు పోసే అక్షర బ్రహ్మల వరకు
సర్వ జాతుల సమాహారం ఏకమై
పరమత సహనం తోనడయాడే నేల ఇది.
పాహిమాం అంటూ శరణం కోరితే గుండెలో చోటు చూపే
సహన సంస్కృతి
హాని తలపెట్ట చూస్తే గుండెలు చీల్చే
శౌర్య సంస్కృతి ఈనేల సొంతం.



-అరుణ కీర్తిపతాక రెడ్డి
9390109311

## అమ్మ నాన్నలో సగమే -అమ్మకు ప్రాణం నాన్న

సంసార జీవన పయనంలో
పిల్లల కోసం..అమ్మనాన్నలు
కష్టపడుతూ అలుపెరుగని
పోరాటయోధులుగా అనునిత్యం
ఆశయాల సాధనకై...
పాటుపడుతున్న దేవతలు.!
సూర్యడు చంద్రుడిలా..
అమ్మ నాన్నలు సగమే కానీ..!
నాన్న సూర్యుడి ఛాయల స్పర్శై
వెచ్చదనాన్ని ఇస్తాడు..
అమ్మ చంద్రుడిలాంటి చల్లని
స్పర్శై అక్కున చేర్చుకుంటుంది.
వెలుగు చీకటిలా..అమ్మ నాన్నలు
తోడు నీడై కలిసుండే శివపార్వతులు
కుటుంబ భారాన్ని భూదేవి అంతా
ఓర్పుతో భరిస్తూ మోస్తోంది అమ్మ..
ఆకాశమంతా ఔన్నత్యానిస్తాడు నాన్న..
అమ్మకు తోడుగా 'నాన్న' భరోసై
వెలుగునిచ్చే సూర్యుడవుతాడు.
మూడుముళ్ల బంధంతో....
నాన్నలో అమ్మ సగమే అయినా?
ఈ విశ్వంలో అమ్మకు ప్రాణం 'నాన్నే'!!



-కొలిపాక శ్రీనివాస్
9866514972

## మాటల సంగీతం అమ్మ

వంద సంవత్సరాలకు
సరిపడా జ్ఞాపకాలను
వదిలేసి వెళ్ళిపోయింది అమ్మ నాకు
అకస్మాత్తుగా
అంతర్ధానమైన దేవతలా.

మురిపాలను
ముర్రుపాలతో కలిపి
అమృతంగా మార్చి
నా నోటికి అందిస్తూ....
అరచేయితో నా తనువంతా నిమురుతూ
ఆనందాన్ని మాత్రమే
నన్నడగకుండా తీసుకునేది అమ్మ.

నాకు ఏ చిన్ని గాయమైనా
ఏడుపు నా గొంతై
శబ్దాల చక్కర్లు కొడుతుంటే
తల్లడిల్లిన అమ్మ మనసు మాత్రం
తక్షణమే కన్నీళ్ళకు జన్మనిచ్చేది
ఎంత విచిత్రమో కదా!.

తనకు కోపం వస్తే
బెత్తం పట్టుకుని బెదిరించేదే తప్ప
నన్ను కొట్టడానికి
చేతులు రావడం లేదని
బుజ్జగిస్తూ బుద్ధులు చెప్పేది.

నేను ఏడుస్తే
ఎదకు హత్తుకోవడం
తనకు ప్రేమొస్తే
ముద్దులు పెట్టడం
నాన్నను నాకు పరిచయం చేయడం
కంటికి రెప్పలా
నన్ను కనిపెట్టుకోవడం తప్ప
వేరే ధ్యాసలేని
వేడుక అమ్మ.

ఊరంతా ఇంటిమీదకు ఉరుకొచ్చి
అల్లరి పిల్లవాడు మీ వాడని
ఆక్రోశించినా
అమ్మ మాత్రం
నన్ను వెనకేసుకొచ్చేది
యుద్ధతంత్రం తెలిసిన సేనానిలా
మాటలతో మనుషులందరినీ తిప్పికొట్టి.

ఇప్పుడు
తను లేదన్నమాటే గాని
నా గుండె చప్పుడై
తన మాటల సంగీతం నాకెప్పుడూ
వినిపిస్తూనే ఉంటుంది
ఇక తను రాదన్న మాటే గాని
నా ఎద గుమ్మంలో నిలబడి
ఎప్పుడూ నన్ను పిలిచినట్టే ఉంటుంది
మాటల తోటల్లో అడుగుపెడితే
పరిమళాల ఆశీర్వాదమివ్వడానికి
ప్రవిమల సుమమై ఎదురుచూస్తుంది
మనసు లోతుల్లోకి ప్రవేశిస్తే....
నిరంతరం నన్ను ప్రోత్సహించడానికి
నిజమైన చిత్రమై తాను నిలబడుతుంది
నన్ను అన్నింటా
నిలబెడుతూనే ఉంది



-కమలేశ్
9160396596

# విలువలు నేర్పే మా బడి కతలు




మానవ జీవితంలో బాల్యం ఎంతో అమూల్యమైనది. అందులో బడిలో జరిగిన కొన్ని సంఘటనలైతే కలకాలం మనకు మధుర స్మృతులుగా నిలిచిపోతాయి. అలాంటి బాల్యపు గుర్తుల్ని మన కళ్ళముందు నిలిపేదే "మా బడి కతలు". బాల సాహిత్య ప్రియులు గరిపెల్లి అశోక్ చక్కని విషయాంశంతో అందమైన పదజాలంతో మాబడి కతలు పుస్తకాన్ని తీసుకొచ్చారు. అనేక బాల సాహిత్య కార్యశాలల నిర్వహణతో పిల్లలతో పాటు ఉపాధ్యాయులను, బాల సాహితీవేత్తలను నిరంతరం ప్రోత్సహించే గరిపెల్లి అశోక్ తన ఉద్యోగ జీవితంలో పొందిన అనుభూతులను, అనుభవాలను తను బోధించిన పాఠశాలలో జరిగిన సంఘటనలు సమహారంగా కూర్చి మా బడి కతల పుస్తకంగా రూపుదిద్దారు.

నేడు బాల సాహిత్యంలో విరివిగా రచనలు వస్తున్నాయి. బాలలు రాసే రచనలు కొన్ని అయితే, బాలల కొరకు పెద్దలు రాసేవి కొన్ని. పెద్దలు రాసే సాహిత్యం బాలల స్థాయికి తగిన విధంగా రాయవలసి ఉంటుంది. అలా రచయిత గరిపెల్లి అశోక్ బాలల స్థాయికి ఎదిగి ఒదిగి రాసిన పుస్తకం ఇది. రచయిత తనలో కలిగిన భావోద్వేగాలను పదిహేను కతలుగా ఒక చోట చేర్చి మా బడి కతలుగా అందించారు. ఇందులో మూడు కథలు మినహా మిగతావన్నీ బడి నేపథ్యంలో సాగినవే. దాదాపు అన్ని బడులలో ఇటువంటి సంఘటనలు జరిగే ఉంటాయి. కరపత్రాలు, బొంతలు, తెల్ల కాగితాలు, బుట్టలు, ఆకులు, చిత్రాలు, పళ్ళాలు, బహుమతులు, ఒకటి రెండు , గాజు వక్కలు, నిజాయితీ, ఫిల్టర్లు కతలు బడి నేపథ్యంలో సాగితే నీళ్లు, చెత్త బుట్టలు, వరుగులు సామాజిక నేపథ్యంలో సాగాయి.

బడి కతలలో పసితనపు అమాయకత్వం, పేదరికం, గ్రామీణ జీవనంలోని వాస్తవ పరిస్థితులు మనకు కన్పిస్తాయి. మొదటి కత కరపత్రంలో కాపీలు కొనలేని శేఖర్ పరిస్థితిని తెలుపుతూ చదువుకు పేదరికం అడ్డుకాదని చెప్పారు. బొంతలు కతలో మహేష్ ఇంటి పరిస్థితులను తెలియజేస్తూనే పనికి రాని వస్తువులను కూడా తిరిగి ఏ విధంగా ఉపయోగించాలో విద్యార్థులకు ఒక ఆలోచన కల్పించే ప్రయత్నం చేశారు రచయిత. పేదరికాన్ని చూపి ఇతరులను ఎగతాళి చేయవద్దని, బొంతలు కుట్టడం కూడా ఒక కళేనని ఒక వస్తువును వివిధ రకాలుగా ఉపయోగించవచ్చునని తెలియజేశారు. పర్యావరణ పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రత గురించి వివిధ కథలలో ప్రస్తావిస్తూ స్వచ్ఛ భారత్, స్వచ్ఛ పాఠశాల యొక్క ఆవశ్యకతను తెలియజేశారు. తడి చెత్త, పొడి చెత్త వేరు వేరుగా సేకరించాలనే స్పృహను విద్యార్థులకు కలిగించారు గరిపెల్లి అశోక్.

చదువు అంటే కేవలం మార్కులు, గ్రేడులే కావని ప్రతి పిల్లవాడిలో ఎదో ఒక సృజనాత్మక ఉంటుందని దానిని వెలికి తీయడమే విద్య అని, అది ఉపాధ్యాయుడి ద్వారా సాధ్యమవుతుందనేది రచయిత ప్రగాఢ విశ్వాసం. చదువుతో పాటు సంస్కారం కూడా ముఖ్యమని ఎంకటి ద్వారా మనకు ఎన్నో కొత్త అనుభవ పాఠాలు నేర్పారు. విహార యాత్రలు, కళలు, సంస్కృతి, ఆటపాటలు మొదలగు అంశాలు విద్యలో భాగం కావాలనే కోణంలో రచయిత రాసిన కతలు ఆలోచింపజేసేవిగా ఉన్నాయి. బడి పిల్లలు సమాజంలో, ఉపాధ్యాయులతో, తోటివారితో ఎలా మేలుగాలో తెలియజేస్తూ బడి, ఇల్లు, ఊరు, సమాజం మొదలగు అంశాలను వివిధ కతలో ప్రస్తావిస్తూ చెప్పిన తీరు బాగుంది. విద్యార్థులలో చైత్యన్యం కలిగించడానికి వారు ఉత్తమ పౌరులుగా ఎదగడానికి ఈ కతలు తోడ్పడతాయి.

పని పట్ల గౌరవాన్ని తెలిపే విధంగా పాఠశాలలో నామమాత్రమైన వృత్తి విద్య, కళా విద్య, నైతిక విలువలకు ప్రాధాన్యం కల్పించి బడిలో బతుకు పాఠాలు కూడా నేర్పవచ్చని తెలిపారు. విద్య అనేది జీవనైపుణ్యాలు, నైతిక విలువలు పెంచే విధంగా ఉండాలని పేర్కొన్నారు. మన పనిని మనమే చేసుకోవాలని చక్కని స్ఫూర్తిని పిల్లల్లో కలిగించేలా ఉన్నాయి కతలు. నీళ్లు కతలో దురాశ దుఃఖానికి చేటని విషయాన్ని గుర్తుచేస్తూ మట్టి కుండల గొప్పతనాన్ని కూడా తెలియజేశారు రచయిత. ఆనందవనం అనే నగరం పరిశుభ్రతను పాటించి ఆనందవనంగా, ప్రశాంత నగరంగా ఏ విధంగా మారిందో తెలుసుకోవాలంటే చెత్త బుట్టలు అనే కతను చదవాల్సిందే. ప్రజలు ఆరోగ్యంగా ఉండటానికి కారణం పరిశుభ్రంగా ఉండటమేనని చెప్పారు. వరుగులు కతలో మామిడి కాయల రుచి చూపించి రాజయ్యకు, రాజవ్వకు రాజు చేత కానుకలు ఇప్పించ్చారు గరిపెల్లి అశోక్. ఒక్క కతని కాదు ఇందులోని ప్రతి కత చదువదగినదే. ఏ కతను కూడా తక్కువ చేసి చూపలేము. అన్నీ కతలు పిల్లలకు, పెద్దలకు ఉపయోగపడేవే.

విద్యార్థుల, ఉపాధ్యాయుల మధ్య గల సంబంధాన్ని వివిధ సందర్భాల్లో చక్కగా చూపెడుతూ ఉపాధ్యాయుడు విద్యార్థికి మార్గదర్శిగా, స్నేహితుడిగా ఉండి వారి సమస్యలను అర్థం చేసుకొని బోధించాలంటారు. ఇందులోని కతలన్నీ మన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసే సజీవ సంఘటనలే. పాఠ్యేతర అంశాల పట్ల అవగాహన పెంపొందించడం, మంచి ఆలోచనలు కలిగించి విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలన్న గరిపెల్లి అశోక్ తాపత్రయం మా బడి కతలతో నెరవేరుతుందని ఆశిద్దాం. బాల సాహిత్యం వికసించాలని అలుపెరుగకుండా శ్రమిస్తూ, నిరంతరం తపిస్తున్న గరిపెల్లి అశోక్ కలం నుండి మరిన్ని బాల సాహిత్య రచనలు రావాలని ఆకాంక్షిస్తూ వారి కృషిని అభినందిద్దాం. ప్రధానోపాధ్యాయులు, చిత్రకారులు కూరెళ్ళ శ్రీనివాస్ ముఖ చిత్రంతో పాటు కతలకు అనుగుణంగా అందమైన బొమ్మలను వేశారు.

ప్రతులకు: గరిపెల్లి సరోజన
404, వివిఎల్ఆర్ రెసిడెన్సి,
శ్రీనివాస నగర్, సిద్దిపేట- 502 103
సెల్ 9441701088.



-కందుకూరి భాస్కర్
9703487088

## "రైతు సుఖీభవ"

రైతు లేక రాజ్యం లేదు
రైతు రాజ్యానికి గుండెకాయ
రైతు లేని రాజ్యం తలలేని మొండెం
రైతు ఉంటడు రాజ్యం ఉంటుంది కానీ
గుండె మోకాళ్ళ కిందికి జారింది
అయినా అది కొట్టుకుంటూనే ఉంటుంది
దేహమనే రాజ్యాన్ని బ్రతికించడానికి
కొట్టులో సరుకులు కొనేవారికి
గుండె కొట్టుకునే దెట్లా తెలుస్తుంది?
అన్నదానం చేసెటోడు అన్నదాత కాదు
అరక దున్నెటోడే అన్నదాత
దేశానికి వెన్నెముక మన రైతన్న
కర్షకుడే దేశానికి క్రాంతి అదే సంక్రాంతి
అందుకే "రైతు సుఖీభవ"అనాలి
"రైతు సుఖమే రాజ్య సుఖము"



-పి.బక్కారెడ్డి
9705315250

## విశ్రమించని రైతన్నలు

అన్నదాతలు ఆగ్రహించారు
సాగు చట్టాల రద్దుకై ఉద్యమిస్తున్నారు
దేశ రాజధాని నడి బొడ్డున నినదిస్తున్నరు
ఆలి పిల్లలతో పోరాటం చేస్తున్నారు
ట్రక్కు, ట్రాక్టర్లలో తరలివస్తున్నారు
ఢిల్లీ నగరాన్ని దిగ్బంధిస్తున్నరు
ఎముకలు కొరికే చలిని సైతం
లెక్క చేయకుండా అలుపెరగని పోరాటం
ప్రభుత్వం వెనక్కి తగ్గుతుందన్న ఆరాటం
రైతుకు గిట్టుబాటు ధర ఇవ్వాలంటున్నారు
లాభసాటి చట్టాలను తేవాలంటున్నరు
ఎద్దు ఏడిస్తే ఎవుసం దండగ
రైతు ఏడిస్తే రాజ్యం దండగ
ఇకనైనా రైతు సంక్షేమ చట్టాలు రావాలి
రైతు రాజ్యాన్ని పునర్నిర్మించాలి
అన్నదాత మోములో చిరునవ్వు చిందాలి



-వై. చంద్రకాంత్ గౌడ్
9441762105

## రోగమా పారిపో

కాలం నిన్ను పొమ్మంటుంది
వల్లకాడులో పాతిపెడ్తానంటుంది
ఏమిటి సైతాన్ కరోనా
పబ్లిక్ క్యా కరోనా ॥కాలం॥

చైనా దేశంలో పాడు రోగం పుట్టింది
ప్రపంచ దేశాలను గజగజ వణికిస్తుంది
కంటికి కనపడని వింత మహమ్మారి
నిత్యం లక్షల మందిని బలి గొంటుంది. ॥కాలం॥

కరోనా రోగాన్ని పారదోలుతున్న
డాక్టర్లు, నర్సులు ఎందరెందరో
పోలీస్, సపాయి కార్మికులెందరెందరో
అందరికి వందనం అభినందనం ॥కాలం॥

ప్రతి మనిషి భౌతిక దూరం పాటించండి
నిత్యం పలుమార్లు చేతులు, ముఖాన్ని కడుకోండి
మాస్కులను తప్పనిసరిగా ధరించండి
కరోనా రోగులను దేవుడే కాపాడాలి. ॥కాలం॥



- నేతాజీ
సెల్: 9849636389

## కాలం

గడిచిన కాలాన్నికి వీడ్కోలు పలుకుతూ
కొత్త ఆశలను స్వాగతిస్తోంది కాలం...
ఆనందాల లోగిట్లో హరివిల్లుల బంధాలతో
అల్లుకుపోతుంది కాలం..
జయాపజయాలను రెండిటిని తులా భారంగా
మోయునది కాలం ....
మరుపురాని జ్ఞాపకాల తో జతకట్టి
నడుస్తున్నది కాలం...
మౌనంగా మరలీ పోనీ నీడగా
నిలిచింది కాలం ...
భవిష్యత్తు కు పసిడి వర్ణమేగా కాలం
నిత్య ఆశలతో చిగురులు వేయు
చిరు దివ్వెల చిరునామా కాలం...
తొలి మలి అడుగుగా అంతుచిక్కని
అన్వేషణలో సాగిపోతుంది కాలం...
సప్త వర్ణాల స్పందనలకు
ప్రతిరూపంగా నిలిచినది కాలం...
నవ్య సవాళ్ళను ఎదుర్కొనే
ఆయుధమేగా కాలం...
"రమ్య" మైన జగతిలో జీవన చెలిమికి
కలిమిగా నిలుచును కాలం..



-వై.రమ్య
9951307281

## వాయుసందేశం

గతాన్ని నెమరువేసుకుంటూ వెలుతున్నాను
ఎండ మండిపోతుంది
ప్రక్కనే ఒక చెట్టునీడలో రాయిపై కూర్చున్నాను
చెట్టునీడ చల్లదనం ఇచ్చింది
గాలి హాయినిచ్చింది
వాటికి నేనేమౌతానని ఆనందాన్నిచ్చాయి
అదే ప్రకృతి నిస్వార్థ తత్వం
అలా కూర్చున్న కునుకుపాటులో
గాలివీచి చెంపన ఏదో కొట్టినట్టైంది
తీసీ చూశాను కాగితం
ఆ కాగితంలోని అక్షరానికి ముల్లుగుచ్చుకుంది
కోపంవచ్చింది
అది దాని ధర్మం కావున తప్పులేదనిపించింది
వీచడం గాలిధర్మం
గుచ్చుకోవడం కాగితం కర్మం
కాగితంవచ్చి ముల్లుపై పడితే తప్పు ముల్లుదికాదు
ముల్లును పీకేశాను
కాగితం ముల్లుపై పడ్డ ,ముల్లు
కాగితంపై పడ్డా నష్టం కాగితానికే
అయినా ముల్లు పడదు దాని తప్పులేదు
ఆ కాగితం చిరిగిఉంది
అక్షరాలు అస్పష్టంగా కనిపిస్తునాయి
ఒక వరుసలో మొదట్లో "మనసు' అని
మూడు అక్షరాలు కనిపించాయి.
ఆలోచించి ఇలా వ్రాసుకున్నాను
'మనసు గతి ఇంతే మనిషి బ్రతుకింతే' అని.
మరో వరుసలో" 'అంతా మ'
మూడక్షరాలు కనిపించాయి
వాటినీ ఆలోచించి 'ఆంతా మట్టేనని తెలుసు
అదీ ఒక మాయేనని తెలుసు' అని వ్రాసుకున్నాను.
అప్పుడర్థమైంది అది
మహాకవి ఆత్రేయగారు రచించిన పాట అని
మనిషి పోయినా జ్ఞాపకాలు కలకాలం నిలిచి ఉంటాయి.
ఆ మహనీయునికి శతకోటి వందనములు తెలుపుతూ
ఆ సువర్ణాక్షరాలను భద్రపర్చుకున్నాను.
ఇది వాయు సందేశం.
ఒక కవిసమ్మేళనంలో ఇంగ్లీషుభాష
కవితా కంటకం మన తెలుగు భాషనే గాయం చేసింది
ఆకాగితాన్ని నాటిన ముల్లు దాని ధర్మం నిర్వర్తించింది
అది తప్పుకాదు.
మనం జాగ్రత్తగా అడుగువేయాలని సూచించింది.
ఎందుకంటే కాగితం ముల్లుపై పడిందిగనుక
కానీ మన తెలుగుభాషను
ఇంగ్లీషు" కంటకం' తానే వచ్చి గుచ్చుకుంది
దాన్ని శిక్షించేదెవరు?
పాతిపెట్టేదెవరు?
దాని ప్రతీకారం తీర్చెదెవరు?
"దేశభాషలందు తెలుగు లెస్స
అనే నానుడి ఎప్పటికి నిలవాలని కోరుకుంటూ..



-ఎలగందుల లింబాద్రి
7659834393

## కనుమరుగైపోవట్టె

వెనుక బడిన తరగతుల బతుకులు
వెక్కిరింతలకు గురవుతున్నాయి.
హామీల వర్షంలో తడుస్తూ..
తడారని గొంతులై
పొద్దెల్లదీస్తున్నాయి.
జనచైతన్యం కరువై
బజారున పడి బోరుమని ఏడుస్తున్నాయి.
సబ్బండ వర్గాల ప్రజలు
సంబురాలకు దూరమై
కరువుకాటకాలతో కకావికలం అవుతున్నాయి.
చేతివృత్తులన్ని చెదలువట్టిన
కట్టెలయి రాలిపోతున్నాయి.
ఒంట్లో నరాలని పోగులుగా అల్లి
వస్త్రమై రక్షనిచ్చే నేతన్న
మగ్గానికి సావుమొర పెట్టుకొని
ఉరితాడై వేలాడుతున్నాడు.
దండోరై బతుకుబాదలను
డబ్బు సప్పుడై ఇనిపించే
డప్పులు నేడు సిలుక్కోయ్యలకు
వ్రేలాడుతూ వేదనను వెళ్లగక్కుతున్నాయి.
వడ్రంగి బాడిస బతుకుదెరువు కరువై
పనిముట్లన్నీ పనిలేక పస్తులుంటున్నాయి.
చాకలి బండ నోరుతెరిసి
ఆనాటి రోజులెటువాయే అని
గతాన్ని వేయి దీపాలు వెలిగించి వెతుకుతుంది.
సాకలి బతుకులు అతుకుల
బొంతలైపాయే.
గోళ్లకురుమలందరు గోసెల్లబోసుకుంటున్నారు.
పరాయి సంస్కృతి నట్టింట్లోకి
చొరబడి నడి వీధుల్లో నాట్యం చేస్తుంటే...
ఉపాధి కరువై కులవృత్తులన్ని
కుంటువడిపాయే.
రాబోయే తరాలకు కులవృత్తుల గురించి
కథలు కథలుగా పుస్తకాల్లో
ముద్రించి బోధించాలేమో....?



-అశోక్ గోనె
9441317361

## హ్యాపీ హ్యాపీ

కోవిడ్ 19 తో మొదలు అయ్యి ఇరువది ఇరవై లో
అతకూతలం చేసి అడుకుంది
2020 కరోనా కరోనా స్ట్రెయిన్ తో
ఊసరవెల్లి నాటకాలు ఆడుతుంది
మానవ మేధస్సు సంకల్పం
ముందు నీ నాటకాలకు ఫుల్ స్టాప్ పెడుతాం
మాస్క్ తో మడుత పెడుతాం
భౌతిక దూరం తో నిన్ను బహుపారక్ చేస్తాం
పరిశుభ్రతే ఆయుదంగా
సమిష్టి విజయం మాదే మాదే
2021 లో అన్ని శుభలే
ఉహలు గుస గుస లాడే
ఊపిరి బిగపట్టిచ్చిన కరోనా ఇతర విపత్తుల కు
బై చెప్పుతాం
మానవులుగా మానవతే
ధ్యేయంగా సర్వేజనో సుఖినోభావంతు అంటూ
ఆరోగ్యభారత్ నిర్మాణంలో చేయూతులమై
సమభవన తో కూడిన భిన్నత్వంలో
ఏకత్వాన్ని ప్రోది చేసి ఆశలు అన్ని
ప్రోది కోసం 2020 బై చెపుతూ
2021 స్వాగతం స్వాగతం



-ఉమశేషారావు వైద్య
9440408080

పుస్తక సమీక్షలు

# శివభక్త్యావేశ భరిత శతకం-కంది శంకరయ్య శంకరాభరణం






తెలుగు పద్య విశిష్ట ఔన్నత్యాన్ని తిరిగి ఈ రోజులలో కూడా సగర్వంగా తలెత్తుకొనేలా చేస్తున్న కవులు, తెలంగాణ సీమలో శతక పద్య ప్రక్రియను ఆధ్యాత్మికతతో విరాజిల్లింప చేస్తున్న పద్యప్రేమిక కవులలో శ్రీ కంది శంకరయ్య భక్త్యావేశంతో రచించిన శంకరశతకం, సుమధుర కవిత్వ పటుత్వంతో ఆకట్టుకొంటోంది. శివరాత్రి పవిత్ర సందర్భంలో ఆ రోజే 54 పద్యాలు, రెండు రోజులలో 108 పద్యాల శతకాన్ని శివస్తుతిగా సమర్పించిన శ్రీ శంకరయ్య 'శంకర' మకుటంతో శివ తత్త్వానుగుణంగా లలిత, ప్రౌఢ చంధోరీతులలో పద్యాలను నడిపించారు. 'అనంతచ్ఛందం', వాట్సప్ సమూహ నిర్వాహకులు శ్రీ తోపెల్ల బాల సుబ్రహ్మణ్యం శతక ప్రచురణ, ఆవిష్కరణోత్సవ బాధ్యతను నిర్వర్తించటం విశేషాంశం.

"ఇదే నా భాగ్యము, నా కొసంగితివి యెంతేనిన్ కృపామూర్తివై" వినమ్ర భక్తి తత్పరతతో పద్య రచనను సార్థకం చేసుకొన్న శ్రీ కంది శంకరయ్య, పదవీ విరమణ అనంతరం 'శంకరా భరణం' బ్లాగు, వాట్సప్ సమూహం, ఫేస్‌బుక్ ద్వారా ఎందరో పద్యకవులను సాధకులుగా తీర్చిదిద్దుతున్నారు. సమస్యా పృచ్ఛక చక్రవర్తిగా సార్థక బిరుదు సత్కారం పొందిన రచయిత చంపకోత్పల, శార్దూల, మత్తేభాలలో భావ, భాషా పరిపుష్ఠితో పద్య రూపకంగా పరమ శివతత్త్వాన్ని ప్రదర్శింపచేసారు. శివనామాలు, నామ మహత్త్వం, పురాణ కథాంశాల, ఘట్టాల ప్రస్తావన, సుగుణ నిర్గుణ శివతత్త్వం, తెలుగు నానుడులు పద్యాలలో చోటు చేసుకొన్నాయి.

"పాపాత్ముల్ సెలరేగి దేశమున సర్వశ్రేష్ఠ సత్సంస్కృతీ దీపాలార్పదలంతురే" అంటూ శతకకర్త ధర్మ సంస్థాపన చేయమని శంకరున్ని ప్రార్థించటం, లోకహితం ఆకాక్షించటం పద్యాలలో స్పష్టమౌతోంది. ఒక శార్దూల పద్యంలో "దోషాడంబర బోధనల్ సులుపుచున్, దుష్టాత్ములై ప్రేలి దుర్భాషల్, లోకుల మోసపుచ్చ కపట వ్యాపార పారీణులై" అంటూ కొందరు కపట కాషాయాంబర దారుల దోరణులను వ్యక్తం చేయటం శతకకర్త శంకరయ్య నిష్కల్మష హృదయ స్ఫటిక సదృశ భావ గాంభీర్యాన్ని తెలియ చేస్తుంది. శంకరాభరణం ప్రచురణలు వెలువరించిన ఈ శంకర శతకం ప్రత్యక్ష దేవాలుగా తల్లిదండ్రులకు అంకితంగా సమర్పించారు.

ప్రతులకు: కంది శంకరయ్య
సెల్: 75698 22984
తోపెల్ల బాలసుబ్రహ్మణ్యశర్మ
కాకినాడ.
సెల్: 93466 76049



-జయసూర్య
సెల్: 9440664610

